ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 30 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 18.4



సహకార ఎన్నికలు లేనట్టేనా?

- ఫిబ్రవరి 15తో పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పదవీకాలం ముగింపు
- సంఘాల్లో కనిపించని ఎన్నికల హడావుడి
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు
- ఆశావహుల్లో నిరాశ

యాదాద్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేదనే అంశంపై చర్చ మొదలైంది. ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయం వెలువడకపోవడంతో ఇప్పట్లో జరగవని, స్థానికంగా ఉన్న ఆశావహులు మదనపడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార(పీఏసీఎస్)సంఘాల్లో ఎన్నికల హడావుడి కన్పించడంలేదు. పీఏసీఎస్ సంఘాల పాలకవర్గం గడువు మరికొద్ది రోజుల్లో ముగియనుంది. సహకార సంఘాల సభ్యుల్లో ఎన్నికల కోలాహలం కన్పించడం లేదు. సాధారణంగా పాలకవర్గం గడువు ముగుస్తుందన్న ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాలి. ఫిబ్రవరి 15వ తేదీతో పీఏసీఎస్‌లు, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పాలకవర్గం గడువు ముగుస్తున్నప్పటికీ, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఎన్నికలు ఇప్పుడు జరగనట్టేనని రైతుల్లో సర్వత్రా చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల మాదిరిగానే సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని స్థానికంగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పలు పార్టీలకు చెందిన నేతలు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లున్నాయి. నల్లగొండ జిల్లాలో 42, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21, సూర్యాపేట జిల్లాలో 44వరకు పీఏసీఎస్‌లు ఉన్నాయి. 2020ఫిబ్రవరి 15నజిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)జిల్లా సహకార మార్కెటింగ్ సహకార సంస్థ(డీసీఎంఎస్) చైర్మన్, వైస్‌చైర్మన్..

- మిగతా 7వ పేజీలో...




మోగిన నగారా

శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. బుధవారం ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించింది. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారని, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపడతారని తెలిపింది. ఇందుకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదేరోజు నుంచి ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫిబ్రవరి 11న నామినేషన్లను పరిశీలిస్తారు. ఫిబ్రవరి 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు విధించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. మార్చి 3న ఓట్లను లెక్కిస్తారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఫిబ్రవరి 27న టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- 24,905 మంది ఓటర్లుగా నమోదు
- ప్రచారం వేగం పెంచిన అభ్యర్థులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఎవరికనేదానిపైనే ఆసక్తి



జిల్లా	మండలాలు	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం
1. సిద్దిపేట	4	4	120	43	163
2. జనగాం	12	12	556	365	921
3.హనుమకొండ	11	15	2884	2214	5098
4.వరంగల్	13	13	1381	844	2225
5.మహబూబాబాద్	18	16	1083	535	1618
6.జె.భూపాలపల్లి	7	7	211	112	323
7.ములుగు	9	9	394	218	612
8.భద్రాద్రికొత్తగూడెం	23	23	1038	911	1949
9.ఖమ్మం	21	24	2300	1655	3955
10.యాదాద్రి	17	17	595	326	921
11.సూర్యాపేట	23	23	1690	947	2637
12.నల్లగొండ	33	37	2688	1795	4483
మొత్తం	191	200	14,940	9,965	24,905

రాష్ట్రంలో చైతన్యవంతమైన ప్రాంతంగా పేరున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో గెలవడం ద్వారా తమ ఉనికిని, సత్తా చాటాలని భావించిన ఉపాధ్యాయ సంఘాలు ఇక్కడ ఇప్పటికే అభ్యర్థులను ఎంపికచేసి ప్రచారం హోరెత్తిస్తున్నాయి. యూటీఎఫ్ టీఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అందరికంటే ముందే ఆ సంఘం తమ అభ్యర్థిగా ప్రకటించి ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఒకవైపు నర్సిరెడ్డి విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తుంటే, ఆయన తరఫున యూటీఎఫ్ శ్రేణులు మండల కమిటీలు మొదలుకొని, జిల్లా కమిటీల వరకు అందరూ కార్యవర్గ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రచార దూకుడు పెంచారు. పీఆర్‌టీయూ టీఎస్ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించిన సంఘం ప్రచారాన్ని ఉధృతం చేసింది. అదేవిధంగా టీపీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సైతం అభ్యర్థిగా బరిలోకి వచ్చారు. ఆయన సైతం నియోజకవర్గంలో విస్తృతస్థాయిలో ప్రచారం కొనసాగిస్తూ తనకు అవకాశమివ్వాలని కోరుతున్నారు. బీజేపీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ మాజీ నేత పులి సరోత్తమ్‌రెడ్డిని ఆ పార్టీ అధికారికంగా ప్రకటించగా, తపస్ నేత తీగుళ్ల సాయిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. మరోవైపున పీఆర్‌టీయూ అభ్యర్థిగా 2013లో ఎమ్మెల్సీగా గెలుపొందిన పూల రవీందర్ జాక్టో అభ్యర్థిగా బరిలో ఉంటున్నారు. రిటైర్డ్ డీఈవో చంద్రమోహన్, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమవడంతో ఈ సారి...

- మిగతా 6వ పేజీలో...



సమయపాలన పాటించాలి

- హైరిస్క్ గర్భిణులను ఏరియా ఆస్పత్రికి తరలించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. బుధవారం హాలియాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హైరిస్క్ ఉన్న గర్భిణులను ఎప్పటికప్పుడు ఏరియా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అదే విధంగా హైరిస్క్ గర్భిణుల రిజిస్టర్లను నెలలవారీగా క్షుణ్ణంగా పరిశీలించి, గర్భిణుల్లో కొద్దిగా రిస్క్ ఉంటే వారిని వెంటనే ఏరియా ఆస్పత్రికి పంపించాలని డాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా ఓపీని మరింత పెంచే విధంగా సేవలు అందించాలని కోరగా, మరో 24 గంటలు ఆస్పత్రి నిర్వహణకు ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారని, మరో డాక్టర్ పోస్ట్ శాంక్షన్ లేదని, అదేవిధంగా స్టాఫ్ నర్సు మరొకరు ఉంటే ఆపరేషన్ చేయడానికి సులువుగా ఉంటుందని కలెక్టర్ దృష్టికి తేగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

అక్కడినుంచి కస్తూర్బా పాఠశాలకు వెళ్లి వంటశాలను, డైనింగ్ ఏరియాను పరిశీలించారు. వంటశాల, డైనింగ్ ఏరియాల్లో మరింత శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల క్లాస్ రూంలలోకి వెళ్లి ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానం చెప్పిన వారిని అభినందిస్తూ చాక్లెట్‌లను సైతం అందజేశారు. వారివెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ, తహసీల్దార్ రఘు, హాలియా పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, ఎస్‌వో హైమావతి తదితరులు ఉన్నారు.

కందుల మార్కెట్ ఏర్పాటు చేయాలి


దళారుల చేతిలో రైతులు మోసపోకుండా హాలియా మార్కెట్‌కు కందుల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా మండల సర్వేయర్‌ను కూడా నియమించాలని, మార్కెట్ కొనుగోలు కేంద్రంలో నిర్వహణ ఐకేపీ, పీఏసీఎస్ వారికి అప్పగించకుండా, మార్కెట్ సిబ్బందికే అప్పగించాలన్నారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

మాడ్గులపల్లి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మండల పరిధిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. మాడ్గులపల్లి మండలం నుంచి ఎక్కువ మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో వినతులు సమర్పిస్తున్నారని, మండల పరిధిలో పరిష్కారమయ్యే రైతులు సమస్యలను ఇక్కడే పరిష్కరించాలన్నారు. అధికారులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కాగా తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ త్వరలోనే నూతన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు. ఆమెవెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ సురేష్, ఆర్ఐ రేణుక ఉన్నారు.



పెండింగ్ వేతనాలివ్వకపోతే సమ్మె!

- ఫిబ్రవరి 12 డెడ్‌లైన్ విధించిన ఉపాధి పథకం సిబ్బంది
- నల్లబ్యాడ్జీలతో కొనసాగిన నిరసనలు
- పేస్కేల్ హామీ అమలుచేయాలనే విన్నపం
- ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావం
- సమ్మెకు వెళితే కీలక పనులకు ఆటంకమే



నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది నిరసనల బాటపట్టారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీలోగా పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జేఏసీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 12 వరకు అంచలంచెలుగా విన్నపాలు అందించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్లాలని జేఏసీ నిర్ణయించింది. ఉపాధి పథకం సిబ్బంది సమ్మెకు వెళితే కీలకమైన ఉపాధి పనుల జాతర, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక వంటి కీలక పనులపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీర్ కన్సల్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు...

- మిగతా 6వ పేజీలో...

సమృద్ధిగా ఎరువులు

● జేడీఏ శ్రవణ్ కుమార్

నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎప్పటికప్పుడు ఎరువుల లభ్యతపై సమీక్ష నిర్వహిస్తున్నారని, రైతుల ప్రయోజనం దృష్ట్యా నెలవారీగా కేటాయింపులకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు జేడీఏ శ్రవణ్ కుమార్ తెలిపారు. 2024 -25 యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 3,92,250 ఎకరాలల్లో వరి, 24,110 ఎకరాల్లో వేరుశనగ, 2,057 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయన్నారు.

జిల్లాలో ప్రస్తుతం 38,683 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా, ఇందులో యూరియా 17,475 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,500 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 7,700 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే కలెక్టర్ పలుచోట్ల ఆకస్మిక తనిఖీ నిర్వహించి, డీలర్లు ఎలాంటటి కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారని వివరించారు.

కేటీఆర్.. మీ నాయనను తీసుకొని రా

- గడియారం సెంటర్‌కు మంత్రి కోమటిరెడ్డి చర్చకు వస్తారు
- డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్



శిలాఫలకం ఫొటో చూపుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, చిత్రంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్.. మీ నాయనను తీసుకొని రా.. గడియారం సెంటర్‌కు మంత్రి కోమటిరెడ్డి చర్చకు వస్తారు అని డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ సవాల్ విసిరారు. కుర్చీ వేసుకొని ప్రాజెక్టులన్నీ పూర్తి చేయిస్తానని కేసీఆర్ మాట తప్పారని నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పి ఒక్క రోడ్డును పూర్తి చేయడం తప్ప జిల్లా కేంద్రంలో వేసిన శిలాఫలకాలు నవగ్రహాలుగా మారి ఉత్సవ విగ్రహాలు అయ్యాయని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లతో కలిసి శంకర్ నాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నల్లగొండలో రైతు మహాధర్నాలో కేటీఆర్ ఈవెంట్ షోను నిర్వహించి అబద్ధాలు చెప్పి వెళ్లిపోయారని, ఆయన సభకు జనం కరువయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మీ నాయన కేసీఆర్‌ను తీసుకొని నల్లగొండకు వస్తే గడియారం సెంటర్‌లో చర్చకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని, దీనికి కేటీఆర్ సిద్ధం కావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండకు ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదని, జీవో లేకుండా, ఎస్టిమేషన్ లేకుండా పరిపాలన అనుమతులు లేకుండా కాగితాలపైనే నిధులు మంజూరైనట్లు చేశారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పేరు ఎక్కడ వస్తుందోనన్న ఆలోచనలో బీఆర్ఎస్ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి బ్రాహ్మణవెల్లెంలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు.

గడీల పాలన సాగించిన కేసీఆర్

కేసీఆర్ గడీల పాలన సాగించాడని, ప్రాజెక్టుల పేరున తండ్రి, కొడుకులు దోచుకున్నారన్నారని శంకర్ నాయక్ అన్నారు. గడియారం సెంటర్ అంటేనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డా అని, ఆ సెంటర్‌లోనే తెలంగాణ సాధనకోసం అమరణ దీక్ష చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో డిండి ప్రాజెక్టు, శివన్నగూడెం, నెల్లికల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. మంత్రులు కోమటిరెడ్డిని, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే కేటీఆర్ రైతు మహాధర్నా పేరిట నాటకం ఆడారన్నారు. జగదీష్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు చేసింది ఏమి లేదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, జూలకంటి శ్రీనివాస్, ఇబ్రహీం, జూలకంటి సైదిరెడ్డి, పిల్లి రమేష్, కత్తుల కోటి, వజ్జ రమేష్ పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో చాకలిగట్టుకు పర్యాటక సొబగు!

- నాగార్జున సాగర్ మధ్యలో ఉన్న నదీ ద్వీపం చాకలిగట్టు
- ఇటీవలే పర్యటించిన రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలపై అధ్యయనం

7



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అపరిష్కృత భూములను పరిశీలించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న భూముల ఖాతాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ధరణి తదితర భూసేకరణ సమస్యలపై పెండిగ్‌లో ఉన్న భూములపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా మండలంలో అపరిష్కృతంగా ఉన్న భూములకు సంబంధించిన ఖాతాలను పూర్తి స్థాయిలో విచారించి, వాటిని సైన్డ్ ఖాతాలుగా మార్చాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, వివాదాలుంటే పైఅధికారుల సూచనలు తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావును ఆదేశించారు. నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, విజయారెడ్డి, ఆర్ఐలు తరుణ్, భవాని పాల్గొన్నారు.

గాంధేయ మార్గంలో...

వ్యక్తికే పరిమితమైన అహింస సిద్ధాంతాన్ని సాంఘిక, రాజకీయ రంగాల్లో సమష్టి ప్రయోజనం కోసం ప్రప్రథమంగా ప్రయోగించిన వ్యక్తి గాంధీ. ఆయన తత్వాన్ని, సిద్ధాంతాలను ప్రస్తుత కాలానికి అన్వయింపచేసి, శాంతి స్థాపనకు కృషి చేస్తున్నాయి గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థలు. 1975 ఆగస్టు 23న గాంధీజీ జ్ఞాన్ ప్రతిష్టాన్, అదేవిధంగా 2001 గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థలను స్థాపించారు. ఈ రెండు సంస్థలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్దఎత్తున కార్యక్రమాలను చేపడుతున్నాయి. గాంధీ ఆలోచనలను, మార్గాన్ని మరింత సుస్థిరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. నేడు గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయా సంస్థల ప్రయత్నాలను తెలుసుకుందాం.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



నల్లగొండలో గాంధీ వేషధారణలో విద్యార్థులు

గాంధీ సిద్ధాంతాల ప్రచారంలో భాగంగా వివిధ రకాల కార్యక్రమాలకు గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థలు శ్రీకారం చుట్టాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాల మైదానంలో 2018 అక్టోబరు 2న 5,500 మంది విద్యార్థులతో బాలగాంధీల వేషధారణతో ప్రదర్శన నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎన్‌సీసీ స్కౌట్‌లకు సంబంధించి 30వేల మంది వరకు పాల్గొన్నారు. బాలికల జూనియర్ కళాశాలకు సంబంధించిన 1000 మందికి పైగా విద్యార్థులు యోగా విన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు గిన్నిస్ బుక్ రికార్డ్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డులో నమోదుచేశారు.

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో గాంధీ నడక, నడవడిక కార్యక్రమాలను చేపట్టారు. వందలాది మంది విద్యార్థులను గాంధీ వేషధారణలతో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలను తీసుకున్నారు.

సృజనాత్మకతను వెలికితీస్తూ

సాంస్కృతిక వారసతాన్ని కాపాడేందుకు గాంధీ సంస్థలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయి. పాటలు, నృతాలు, కోలాటం, సాంస్కృతిక రంగాలతో పాటు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను ప్రదానం చేస్తున్నాయి. గాంధీజీ విశ్వకవి సమ్మేళనం, జల కవితోత్సవంతో పాటు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి విద్యార్థులందరికీ పరీక్షలపై భయం పోగొట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి.

కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు

కరోనా మహమ్మారి సమయంలో గాంధీ సంస్థలు నిత్యావసరాలతో పాటు ఔషధాలను, మంచినీటి సౌకర్యాన్ని కల్పించడంతో పాటు సంస్థ ప్రతినిధులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరోనాపై అవగాహన కల్పిస్తూనే బాధితులకు భరోసానిచ్చి మద్దతుగా నిలిచాయి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను సాధన చేయడం కోసం గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు వారికి వివరిస్తూ కరోనా సమయంలో ముందడుగు వేశారు.



» సేవా కార్యక్రమాల్లో గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థలు





విన్యాసాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సాహం...

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గాంధీ సంస్థలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు చేపట్టాయి. సేంద్రీయ సాగును ప్రోత్సహించడానికి పుడమి పుత్ర, కిసాన్ సేవా రత్నా అవార్డులను అందిస్తున్నాయి. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల కోసం గాంధీజీ సంస్థలు కార్యక్రమాలను చేపట్టాయి. నల్లగొండలో రైతులకు, విద్యార్థులకు సోలార్‌పై అవగాహన కల్పించడంతో పాటు ప్రకృతి వైద్యంపై శిబిరం నిర్వహించారు. 2017లో చండూరులోని పలు విద్యాసంస్థల్లో గాంధీ సిద్ధాంతాలపై అవగాహన కల్పించారు.

గాంధీ సంస్థల లక్ష్యాలు

- ప్రజలు శాంతియుత జీవనం సాగించేలా గాంధీజీ బోధనలు ప్రచారం.
- ప్రజల్లో అహింస సిద్ధాంతం, విధానాలపై ఆదరణ పెరగడానికి కృషి.
- గాంధీజీ రచనలను, ఆయనపై ప్రముఖ రచయితలు రాసిన వ్యాసాలను, రచనలను సేకరించి భద్రపర్చడం, ప్రచురిస్తారు.
- గాంధేయ జీవనంపై సాధారణ ప్రజల్లో మక్కువను కలిగించేందుకు గ్రంథాలయాలు, పట్టణాలయాలు, అధ్యయన కేంద్రాలను నెలకొల్పారు.
- అధ్యయన కోర్సులు, సభలు, సమావేశాలు, సదస్సులను నిర్వహించడం, ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, బహుమతులను అందిజేస్తున్నారు.
- సాంఘిక దురాచారాలపై విద్యార్థుల్లో చైతన్య స్థాయిలు పెంచడం, అహింసా, సత్యం, కరుణలను ప్రోత్సహించడం.
- న్యాయమైన విద్యావ్యవస్థను అందుబాటులోకి తేవడం, వైద్య, సౌకర్యాలు కల్పించడం.
- ప్రకృతి వైద్యం, వైజ్ఞానిక మార్గం, చేనేత బాట, సాహిత్య, మద్యపాన నిషేదంపై అవగాహన కార్యక్రమం, చర్క మహోత్సవం, సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గోశాల నిర్వహణతో పాటు మహిళా సాధికారిత, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి అందించడమే లక్ష్యం

సుస్థిరాభివృద్ధిని సాధించడం, లక్ష్యాలను అధిగమించడం కోసం తమ సంస్థలు పెద్దఎత్తున కార్యక్రమాలను చేపడుతున్నాయి. స్వాతంత్ర్యం తరువాత దేశం ఏవిధంగా ఉండాలో గాంధీజీ సూచించిన అంశాలనే ఐక్యరాజ్యసమితి 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలుగా ఎంపికచేసింది. 2030 నాటికి ఆ లక్ష్యాలు అందేలా తమ సంస్థలు అనేక కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. ప్రజలను చైతన్యం చేయడానికి గాంధీ సంస్థల ప్రతినిధులు కృషి చేస్తున్నారు.



- యానాల ప్రభాకర్ రెడ్డి, గాంధీజీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి

బైక్ వాగులో పడి భార్యాభర్తలకు గాయాలు

ఆలేరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో బైక్ వాగులో పడి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరులోని స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన సందెన రామనర్సయ్య భార్య లక్ష్మీతో కలిసి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామానికి బంధువుల దశదినకర్మకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొలనుపాక వాగు ఉధృతం కావడంతో స్కూటర్ అదుపు తప్పి వాగులో పడిపోయారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానిక యువకులు వారిని ఒడ్డుకు తీసుకువచ్చారు. 108 వాహనంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రానర్సయ్య ఎడమ చేయి విరిగిపోగా భార్య లక్ష్మికి కూడా గాయాలయ్యాయి.

ఇనుప కంచె తగిలి వాహనదారుడికి గాయాలు

నాగార్జునసాగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నేవీ కార్యాలయం వద్ద ఇనుప కంచె తగిలి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. బాధితుడు రమావత్ రాజు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన రాజు తన బైక్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లకు వెళ్లి వస్తున్నాడు. హిల్‌కాలనీ నేవీ కార్యాలయం వద్దకు రాగానే ఎదురుగా వాహనం వస్తుండంతో రోడ్డు కిందకు దిగాడు. దీంతో అక్కడే ఉన్న ఇనుప ముళ్ల కంచె బైక్‌కు తగిలి కిందపడిపోయాడు. దీంతో బాధితుడి కాళ్లకు, చేతుకలు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు 108 వాహనంలో స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. రాజు ఘటనతో ముళ్ల కంచెను నేవీ అధికారులు తొలగించారు.

దూషించిన కేసులో వ్యక్తికి జైలు

గరిడేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అకారణంగా దూషించిన కేసులో ఓ వ్యక్తికి నల్లగొండ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి రోజారమణి ఆరు నెలల జైలుతో పాటు జరిమానా విధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. గరిడేపల్లి మండలం కుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన నకిరేకంటి వెంకటయ్య అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన గుండా లింగయ్య డప్పు కొట్టే విషయంలో గొడవపడి దూషించి, దాడి చేసేందుకు ప్రయత్నించాడు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు లింగయ్యపై ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో వెంకటయ్యను దూషించిన విషయం రుజువుకావడంతో లింగయ్యకు ఆరు నెలలు సాధారణ కారాగార శిక్ష, 1000 రూపాయల జరిమానా విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రోజారమణి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ నరేష్, కోర్టు కానిస్టేబుల్ సైదులును ఉన్నతాధికారులు అభినందించారు.

పోలీసుల అదుపులో మల్లయ్య హత్య కేసు నిందితులు?

శాలిగౌరారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఉప్పలంచ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ తాజా సర్పంచ్ బండారు మల్లయ్య హత్య కేసుకు సంబంధించిన కేసులో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శాలిగౌరారం మండలానికి చెందిన కొంతమందితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రత్యేక విభాగంలో తమదైన శైలిలో విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు గాలింపుచర్యలను ముమ్మరం చేశారు. ప్రత్యేక బృందాలు అతడి కోసం వేట ముమ్మరంచేశాయి. మల్లయ్య హత్య జరిగి వారం గడుస్తున్నా నిందితుల అరెస్టును చూపకపోవడంపై గ్రామస్థులు, మల్లయ్య కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలంచ గ్రామంతో పాటు మూసీ అవతల ఉన్న గ్రామానికి చెందిన వారు కూడా ఈ హత్యలో భాగస్వామ్యం అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసుల అదుపులో బైక్ చోరీల దొంగ?

నల్లగొండ క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బైక్‌లను చోరీ చేస్తున్న ఓ దొంగను నల్లగొండ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని పోలీసులు ఆ బైక్ చోరీల దొంగను హైదరాబాద్‌లో చాకచక్యంగా పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఆ దొంగ నుంచి నాలుగు ద్విచక్రవాహనాలను రికవరీ చేసి అతడు చేసిన ఇతర నేరాలపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే అతడి నుంచి అతి తక్కువ రేటుకు పేపర్లు లేకున్నా వాహనాలను కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నేడో రేపో దొంగను మీడియా ముందుకు తేనున్నట్లు సమాచారం.

పెరిగిన చైన్‌స్నాచింగ్ బాధితుల సంఖ్య

● మహారాష్ట్రకు చెందిన ముఠాగా గుర్తింపు ● పట్టుకునేందుకు నాలుగు బృందాలు

నల్లగొండ క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగవారం నిర్వహించిన రైతు మహాధర్నాలో జరిగిన చైన్‌స్నాచింగ్ బాధితుల సంఖ్య బుధవారానికి పెరిగింది. మంగళవారం సుమారు ఆరుగురు పోలీసులకు ఫిర్యాదుచేయగా, బుధవారానికి ఆ సంఖ్య 12కు చేరింది. అయితే బాధితుల్లో ఎక్కువగా తులంన్నర నుంచి రెండు తులాల బంగారు గొలుసులు చోరీకి గురయ్యాయి. మంగళవారం చోరీ జరిగిన వెంటనే ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో విచారించారు. అతడిచ్చిన సమాచారం మేరకు పోలీసులు చోరీలకు పాల్పడింది అంతర్రాష్ట్ర ముఠాగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మహారాష్ట్రకు చెందిన అనుభవం ఉన్న చోరీ ముఠాను పట్టుకునే పనిలో పడ్డారు. అయితే ఈ చోరీ పక్కా ప్రణాళిక ప్రకారం మంగళవారం రోజు ఉదయం నుంచే మీటింగ్ జరిగే ప్రాంతం మొదలుకుని ర్యాలీ జరిగే ప్రతీ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి ఎవరెవరూ ఎక్కడ ఉండి చోరీ చేయాలో పథకం రచించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ చోరీలో మొత్తం 14 మంది వరకూ పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేట ప్రారంభించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు బృందాలు నేరస్తులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నేటి నుంచి కుష్ఠువ్యాధి అవగాహన పక్షోత్సవాలు

● ఫిబ్రవరి 13 వరకు నిర్వహణ
● యాదాద్రిభువనగిరి జిల్లాలో 45 లెప్రసీ కేసులు
● నేడు ప్రపంచ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం



(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

మహాత్మాగాంధీ సేవలకు గుర్తింపుగా ప్రతీ ఏడాది నిర్వహించే కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. జనవరి 30న గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 13 వరకు 15 రోజుల పాటు వైద్య, ఆరోగ్య శాఖ పలు కార్యక్రమాలు నిర్వహించనుంది. నిర్దేశిత రోజుల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఇతర సామూహిక కార్యక్రమాలన్నింటిలో వైద్యసిబ్బంది కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తారు. స్థానికంగా ర్యాలీలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అం శాలు వివరిస్తారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి మందులు, చికిత్సలు అందిస్తారు.

యాదాద్రి జిల్లాలో 45 కేసులు

యాదాద్రిభువనగిరి జిల్లాలో 45 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులుఉన్నారు. వారికి పీబీ, ఎంబీ విధానంలో చికిత్సలు సాగుతున్నాయి. నిర్లక్ష్యంతో ఐదారుగురు దివ్యాంగులుగా మారారు. గత ఐదేళ్లుగా జిల్లాలో ప్రతి ఏడాది 45 నుంచి 50 మంది కుష్ఠు వ్యాధి బారిన పడుతూ చికిత్సలతో వ్యాధి నుంచి విముక్తులవుతున్నారు.

చికిత్సలు ఇలా..

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆపై స్థాయి ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలో కుష్ఠి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఔషధాలు, చికిత్సలు అందిస్తారు. బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) విధానంలో ఆరు నెలల నుంచి 12 నెలలలోపు వ్యాధి పూర్తిగా నయమవుతుంది. అయితే గుర్తింపు, చికిత్సల్లో నిర్లక్ష్యం చూపితే నరాలపై ప్రభావం చూపి శాశ్వత అంగవైకల్యం ఏర్పడే అవకాశం ఉంది. ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉన్నవారికి ప్యాచి బ్యాచిలరీ(పీబీ) కేటగిరీలో ఆరు నెలలు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాచిలరీ(ఎంబీ) కేటగిరీలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. చికిత్సలు కొనసాగినంత కాలం అందరితో కలిసి జీవించవచ్చు. కానీ తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు దూరంగా ఉండటంతో పాటు తుంపర్లు గాలిలో వ్యాపించకుండా మాస్క్ లేదా శుభ్రమైన వస్త్రాన్ని మూతికి, ముక్కుకు అడ్డంగా పెట్టుకోవాలి.

వంశపారంపర్యం, అంటువ్యాధి కాదు



కుష్ఠు వ్యాధి వంశపారంపర్యం, అంటువ్యాధి కాదు. సకాలంలో గుర్తించి చికిత్సలు పొందితే ఏడాదిలోపు పూర్తిగా కోలుకోవచ్చు. తదనంతరం కొద్దికాలం జాగ్రత్తలు పాటించాలి. నిర్లక్ష్యం చూపితే శరీరంపై తీవ్రప్రభావం చూపుతుంది. వ్యాధి లక్షణాలు ఉన్న వారు అనుమానాల నివృత్తికి స్థానికంగా ఉండే వైద్యసిబ్బందిని లేదా పీహెచ్‌సీని సంప్రదించాలి. పక్షోత్సవాలలో వైద్యసిబ్బంది కుష్ఠువ్యాధిపై ప్రజలను చైతన్యపరుస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేశాం.
డాక్టర్ మనోహర్, యాదాద్రి జిల్లా వైద్య శాఖ అధికారి.

హస్తకళా ప్రవీణుడు బ్రహ్మాచారి

(ఆంధ్రజ్యోతి - చింతపల్లి)

అతడి చేతిలో దేవతామూర్తులు జీవం పోసుకుంటాయి. ఇతర అలంకరణ వస్తువులు మూర్తులకు మరింత అందాన్ని తెచ్చిపెడుతుంటాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లికి చెందిన ముంజంపల్లి సోమబ్రహ్మాచారి హస్తకళలో తన ప్రావీణ్యాన్ని చాటుకుంటున్నారు. 1985-86లో కేంద్ర ప్రభుత్వం హస్తకళ శిక్షణపై ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసింది. రూ.200 ఖర్చుతో 60 రోజుల శిక్షణ పూర్తి చేసిన బ్రహ్మాచారి పట్టుదలతో ఆ రంగంలో ప్రావీణ్యం సాధించారు. ఆధ్యాత్మిక మార్గంలో ఆసక్తి ఉన్న బ్రహ్మాచారి ఆలయాలకు కావాల్సిన దేవుళ్ల విగ్రహాలను తయారుచేయడంతో పాటు రేగు గింజ సైజులో వివిధ రూపాలను చెక్కుతూ తన ప్రతిభను చాటుతూ సమాజంలో గుర్తింపు పొందుతున్నాడు.



హారతిపళ్లెంను తయారు చేస్తున్న బ్రహ్మాచారి

ఇత్తడి, రాగి విగ్రహాలు

చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్‌లో ఉంటున్న బ్రహ్మాచారి ఖాళీ సమయాల్లో కొత్త రూపాలను చేతులతో వస్తువులపై రూపొందించి తీర్చిదిద్దుతున్నాడు. ప్రధానంగా ఇత్తడి, రాగి విగ్రహాలతో పాటు శిల్పాల తయారీతో పాటు ధ్వజస్తంభాలు, శిఖర కలశాలు, మఖరతోరణాలు, విగ్రహాల వెనుక భాగంలో ఏర్పాటు చేసే ప్రభతోరణాలు, కవచాలు, కిరీటాలు, రాగి యంత్రాలు, దర్గాలకు, పీర్ల పండుగకు ఉపయోగించే వస్తువులను తయారు చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాల్లో..

బ్రహ్మాచారి రూపొందించిన విగ్రహాలు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ దేవాలయాల్లో కనిపిస్తాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలోని సాయిబాబా దేవాలయానికి కిలో వెండితో కిరీటం తయారుచేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో మేరీమాతకు వెండి కిరీటంతో పాటు గొడుకొండ్ల, వెంకటేశ్వరనగర్‌లోని పలు ఆలయాలకు వెండికిరీటం, మకరతోరణాలు, ప్రభలు తయారు చేసి అందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన విజయవాడ కనకదుర్గా ఆలయానికి కిలో వెండితో నవరత్న కిరీటం తయారుచేసి అందించారు. రేగు గింజ సైజులో ఉన్న వాటిపై వినాయకుడిని ఒకవైపు, మరోవైపు లక్ష్మీదేవి విగ్రహాలను చెక్కి ప్రశంసలు అందుకున్నాడు. వీటితో పాటు పలు ఆలయాల్లోని విగ్రహాలకు జీవం పోసి అందరి మన్ననలు పొందుతున్నారు. 2024 నవంబరు 19న హైదరాబాద్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమబ్రహ్మాచారిని మాజీ స్పీకర్ మధుసూదనాచారి సన్మానించారు.

● హస్తకళతో పాటు రచయిత కూడా రాణిస్తున్నారు. సోమ శతకంతో పాటు విశ్వకర్మ వ్రతకల్పం రచించారు. ఈ రచనల గుర్తించిన విశ్వబ్రాహ్మణ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ సన్మానించిన, బహుమతి అందజేశారు.





చింతపల్లి సాయిబాబా ఆలయానికి తయారు చేసిన కిరీటం, మార్కండేయ ఆలయానికి తయారుచేసిన నాగాభరణం

మోగిన నగారా

(5వ పేజీ తరువాయి)

ఈ ఎన్నిక రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల బరిలో నిలబడేందుకు సిద్ధమైన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఇప్పటికే ప్రచారం ఉధృతం చేయడంతో ఉపాధ్యాయవర్గాల్లో సందడి ఏర్పడింది.

కాంగ్రెస్ మద్దతు ఎవరికనే అంశంపై అందరి దృష్టి

కీలకమైన ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎవరికి మద్దతిస్తుందనే అంశంపైనే ఇటు ఉపాధ్యాయ వర్గాల్లో, అటు రాజకీయ వర్గాల్లో ఆసక్తి కనిపిస్తోంది. అధికార పార్టీ కావడంతో కాంగ్రెస్ మద్దతు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సాధించాలని ప్రధాన అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. పీసీసీ అధికార ప్రతినిధిగా బాధ్యతల్లో ఉన్న టీపీఆర్‌టీయూ అభ్యర్థి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ అధికారికంగా మద్దతిస్తుందా..? లేదా..? అనే విషయం తేలాల్సి ఉంది.

పార్టీనుంచి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో ఎవరికి మద్దతిస్తారనే అంశంపై ప్రకటన రాలేదు. కరీంనగర్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు కూడా ఎన్నికలు జరగనుండడంతో ఈ మూడు నియోజకవర్గాల్లో ఎలాంటి వ్యూహం అనుసరించాలనే అంశంపై త్వరలోనే కాంగ్రెస్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. గత ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ ఎవరికీ అధికారికంగా మద్ధతివ్వలేదు. అయితే అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు మద్దతిచ్చింది. ఈ సారి బీఆర్ఎస్ ఎవరికి మద్దతిస్తుందనే అంశం సైతం ఆసక్తికరంగానే ఉంది. బీజేపీ మాత్రం తమ పార్టీ అభ్యర్థిగా పులి నరోత్తమ్‌రెడ్డిని అధికారికంగా ప్రకటించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ సైతం ఏదో ఒకనిర్ణయం ప్రకటించాల్సిన అనివార్యత ఏర్పడింది.

నియోజకవర్గంలో నమోదైన ఓటర్లు 24,905 మంది

12 జిల్లాల్లో 191 మండలాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గంలో డిసెంబరు 30న ప్రచురించిన తుది పబ్లికేషన్ మేరకు 24,905 మంది ఓటర్లు నమోదయ్యారు. ఈ నియోజకవర్గంలో 200 పోలీంగ్ స్టేషన్లను గుర్తించారు. మొత్తం ఓటర్లలో పురుషులు, 14,940 మంది ఉండగా, స్త్రీలు 9,965 మంది నమోదయ్యారు. ఇందులో అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,098 మంది ఓటర్లుంటే, ఆ తర్వాత నల్లగొండలో 4,483 మంది, ఖమ్మం జిల్లాలో 3,955 మంది ఓటర్లు నమోదయ్యారు. అత్యల్పంగా సిద్ధిపేట జిల్లాలో 163 మంది ఓటర్లుండగా, ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 323 మంది, ములుగు జిల్లాలో 612 మంది మాత్రమే ఓటర్లు నమోదయ్యారు.

పెండింగ్ వేతనాలివ్వకపోతే సమ్మె..!

(5వ పేజీ తరువాయి)

అకౌంట్ అసిస్టెంట్లు, అడిషనల్ పీడీలు, ప్లాంటేషన్ల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, పీవోలు ఇలా వివిధ విభాగాల్లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,150 మందివరకు పనిచేస్తున్నారు. వీరందరికీ గత నాలుగు నెలలుగా వేతనాలు అందించలేదు. వీరందరికీ ఉపాధి పథకం కింద కేటాయించిన బడ్జెట్‌లోనే ప్రతినెలా వేతనాలు చెల్లించాల్సి ఉండగా, నాలుగు నెలలుగా ఆ ప్రక్రియ నిలిచింది. దీంతో వేతనాలందక ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులుపడుతున్నారు.వేతనాల చెల్లింపులతో పాటు, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాల్ని పర్మినెంట్ చేయాలని, పేస్కేల్ వర్తింపజేయాలని జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు ఇప్పటికే వినతి పత్రాలిచ్చామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావాన్ని జేఏసీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెకు వెళితే ఇబ్బందే...

వేసవి సమీపిస్తుండడంతోపాటు ఉపాధి హామీ పథకం కింద ఏడాది చివరి కావస్తుండడంతో రాబోయే రెండు నెలల్లో ఉపాధి జాతర కింద పనులు విరివిగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సైతం ఈ ఉద్యోగులే అర్హులను గుర్తించి నివేదికలివ్వాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉపాధి పనులు నిర్వహించే కూలీల మస్టర్లు, ఆన్‌లైన్ నమోదు మొదలుకొని, పనుల ప్రగతిని నివేదించే విధులు నిరంతరాయంగా సాగే సమయంలో ఉద్యోగులు, సిబ్బంది సమ్మెకు వెళితే ఈ పనులన్నింటిపైనా ప్రభావం పడుతుందని చెబుతున్నారు. ఉపాధి సిబ్బంది ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం సమ్మెవరకు పరిస్థితి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

వచ్చే నెల 12వరకు శాంతియుత నిరసనలు

తమకు పెండింగ్ వేతనాలివ్వాలనే ప్రధాన డిమాండ్‌తో పాటు, సమస్యలు పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేదీ వరకు అంచలంచెలుగా శాంతియుత నిరసనలు నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ నెల 30న తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు, 31న, ఫిబ్రవరి 1న పెన్‌డౌన్, ఫిబ్రవరి 2న ఉపాధిహామీ పథక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులను కలవడం, 3న ఎమ్మెల్యేలు, ఎంపీలకు, 4న కలెక్టర్లకు వినతిపత్రాలు, 5న కలెక్టరేట్‌ల వద్ద శాంతియుత నిరసన చేపడతారు. 6న జిల్లా ఉద్యోగ, అధికార సంఘాలకు వినతిపత్రాలు, 7న ప్రజాభవన్‌లో, 8న కమిషనర్‌కు, 9,10 తేదీల్లో మంత్రులకు వినతిపత్రాలందించడం, 11న సీఆర్‌డీ కార్యాలయంలో శాంతియుత నిరసన చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 12న సమ్మెకు వెళుతున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌కు నోటీస్ అందిస్తామని వెల్లడించారు.

ఉపాధి పథకం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

1. పేస్కేల్ వర్తింపజేయాలి.
2. సింగిల్ కంప్యూటర్ ఆపరేటర్లున్న చోట మరొకరిని నియమించాలి.
3. గ్రాట్యుటీని రూ.20లక్షలకు పెంచాలి.
4. సిబ్బంది మరణిస్తే ఎక్స్‌గ్రేషియా రూ.15లక్షలకు పెంచాలి.
5. సిబ్బంది, కుటుంబసభ్యులకు చికిత్సకోసం అందించే మొత్తం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి.
6. ఉద్యోగి అకాల మరణం చెందితే వారి కుటుంబ సభ్యులకు ఆరునెలల్లో కారుణ్య నియామకం ఇవ్వాలి.
7. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా బేసిక్‌పైన 12శాతం పీఎఫ్ జమచేయాలి.
8. పీఆర్‌సీ నిబంధనలకనుగుణంగా బేసిక్‌పేను పెంచాలి.
9. సీనియార్టీ జాబితా మేరకు ప్రమోషన్లు ఇవ్వాలి.
10. ప్రతి ఆరేళ్ల సీనియార్టీకి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
11. కంప్యూటర్, అకౌంట్స్ అసిస్టెంట్లకు రూ.500 నుంచి రూ.5వేలకు స్పెషల్ అలవెన్స్ పెంచాలి. ఫిక్స్‌డ్ ట్రావెలింగ్ అలవెన్స్‌ను టీఏలకు రూ.6వేలకు, ఏపీవో/ఈసీ/జేఈలకు రూ.8వేలకు పెంచాలి.
12. సోషల్ ఆడిట్ కొత్త విధానంలో మార్పులు చేయాలి.
13. హోదాల మార్పు జరగాలి.
14. పంచాయతీరాజ్‌శాఖలో విలీనం చేయాలి.

అయినా.. తీరు మారలేదు

● తిరుమలగిరి పోలీసులపై పలు వివాదాలు, ఆరోపణలు ● తాజాగా ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ, కానిస్టేబుల్

తిరుమలగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ ఏదో ఒక కారణంతో వార్తల్లో నిలుస్తోంది. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐలు రెండేళ్లు పనిచేసిన దాఖలాలు లేవు. ఐదారేళ్లలోనే ఆరుగురు ఎస్ఐలు మారారు. పలు ఆరోపణలతో వీఆర్‌కు అటాచ్ అవుతున్నారు. అవినీతి ఆరోపణల కారణంగా తరుచూ కొంతమంది బదిలీ కాగా, కొంత మంది వీఆర్‌కు అటాచ్ అవుతున్నారు. ఆరోపణలపై పనిష్మెంట్ ఇస్తున్నా, ఇక్కడ విధులు నిర్వహించడానికి వచ్చే ఎస్ఐల తీరుకూడా అలాగే ఉంటోంది. రెండు రోజుల క్రితం ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ సురేష్ 2024 ఆగస్టు 1వ తేదీన తిరుమలగిరి ఎస్ఐ విధుల్లో చేరారు. రెండు నెలల్లోనే గత సంవత్సరం అక్టోబరు 3వ తేదీన తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో డీజిల్ దొంగతనం కేసుల్లో ఎస్ఐ సురేష్ తనను దుర్భాలాడుతూ, తీవ్రంగా కొట్టారని మనస్తాపానికి గురై శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన శెనిగ నాగరాజు ఉరేసుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకుంటూ తన స్నేహితులకు పంపించాడు. ఆస్పత్రిలో కొన్ని రోజులు చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఆ కేసులో ఎస్ఐ సురేష్‌పై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పోలీస్‌శాఖపై విమర్శలు వచ్చాయి. విధుల్లో చేరినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. పంచాయితీలు సెటిల్మెంట్‌లు కూడా చేసినట్లు సమాచారం. తాజాగా మరో మూడు నెలల వ్యవధిలోనే ఏకంగా రేషన్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి రూ.3 లక్షలు డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు కానిస్టేబుల్ నాగరాజు ద్వారా డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐలు కొందరు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న అభియోగాలపై విశ్వసనీయ సమాచారం మేరకు వీఆర్‌కు అటాచ్ కాగా, కొందరు సివిల్‌కేసులో తలదూర్చడంతో పనిష్మెంట్‌పై బదిలీ అయ్యారు.



ఇసుక అక్రమ రవాణాలో..

ఇసుక అక్రమ రవాణాకు పోలీసులే సహకరిస్తున్నట్లు బిక్కేరు వాగు సరిహద్దు ప్రజలు ఆరోపిస్తున్నారు. 100కు డయల్ చేస్తే, డ్యూటీలో ఉన్న సిబ్బంది ఫోన్‌చేసిన వారి వివరాలు చెప్పడంతో, ఇసుక అక్రమ రవాణా వ్యాపారులు బెదిరించిన సందర్భాలు ఉన్నాయి. ఇసుక ట్రాక్టర్ల ద్వారా వచ్చిన డబ్బులు పంచుకునే విషయంలో తేడాలు రావడంతో ఈ పంచాయితీ ఏకంగా పోలీస్‌స్టేషన్ సెట్‌లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకు న్నట్లు ఆరోపణలున్నాయి. ఇసుక రవాణా డబ్బుల కోసం రాత్రి సమయాల్లో డ్యూటీ వేయించుకోవడానికి సిబ్బంది పోటీపడతారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పోలీస్ వాహనాలకు ప్రైవేట్ డ్రైవర్లు?

పోలీస్ వాహనాలకు ప్రైవేట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వ్యక్తుల హడావుడి ఎక్కువగా ఉందనే ఆరోపణలున్నాయి. తనిఖీ కోసం ఆపే క్రమంలో వాహనాలను కర్రలు పట్టుకుని ఆపుతున్నారని విమర్శలున్నాయి.

పర్మినెంట్ చేయండి మహాప్రభో..

● కొన్నేళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ వర్కర్లు ● ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లు

దేవరకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ వర్కర్లుగా పనిచేస్తున్నాం. ఉద్యోగ భద్రతలేదు. చాలీ, చాలని జీతాలతో కుటుంబ పోషణ భారమవుతోంది. పర్మినెంట్ చేసి నెల, నెలా వేతనాలు అందేలా చూడాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దేవరకొండ ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిలో 45మంది ఔట్‌సోర్సింగ్ వర్కర్లు పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో శానిటేషన్, స్వీపర్లు, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. కాని నెలకు రూ.10,500 కాంట్రాక్టర్ వేతనాలు అందిస్తున్నాడని అవి కూడా నాలుగు నెలలకు ఒకసారి వస్తుండడంతో కుటుంబపోషణ భారమవుతోందని కాంట్రాక్ట్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదన్నారు. అందరినీ పర్మినెంట్ చేసి నెల, నెలా వేతనాలు అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్



- నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి.
- ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యూలర్ చేయాలి.
- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- మృతిచెందిన కార్మికుల స్థానాలలో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి.
- రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలి.
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 1వ తేదిన జీతాలు ఇవ్వాలి.
- కార్మికుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందజేయాలి.
- డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలాలు అందజేయాలి.

25 సంవత్సరాలుగా పనిచేస్తున్నా



25 సంవత్సరాలుగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నా. నాలుగు వందల జీతం నుంచి పనిచేస్తున్నా. ప్రస్తుతం రూ.10,500 ఇస్తున్నప్పటికీ సరిపోవడంలేదు. నెలకు రూ.26వేల వేతనం అందజేసి పర్మినెంట్ చేయాలి.

అంకూరి రామేశ్వరమ్మ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, దేవరకొండ

నెల, నెలా జీతాలు ఇవ్వాలి



నెల, నెల జీతాలు ఇవ్వాలి. 24 సంవత్సరాలుగా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులుపడుతున్నాం. 9 గంటలు విధులు నిర్వహిస్తున్నాను.

● చిత్రం తారమ్మ, శానటేషన్ ఉద్యోగి

ఫిబ్రవరి 1న రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక

చిట్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): త్రోబాల్ సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు వచ్చే నెల 1న నల్లగొండ జిల్లా చిట్యాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు త్రోబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరాజు, కార్యదర్శి మోత్కూరు యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు డిసెంబరు 1వ తేదీ, 2009 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు.

జాతీయ విద్యా సదస్సుకు ఉపాధ్యాయుడికి ఆహ్వానం



డిండి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఫిబ్రవరి 9వ తేదీన జరిగే జాతీయ విద్యా సదస్సులో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా డిండి మండలం తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలరాజుకు బుధవారం ఆహ్వానం అందింది. ప్రస్తుత విద్య విధానాలు, విద్య విధానంలోని నూతన పోకడలు, భవిష్యత్ అవసరాల దృశ్యా ఈ లెర్నింగ్ ఆవశ్యకతపై సదస్సులో ప్రసంగించనున్నారు. జాతీయస్థాయి సదస్సుకు బాలరాజుకు ఆహ్వానం అందడంపై ఎంఈవో గోప్యానాయక్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

31న సెయింట్ ఆల్ఫోన్సస్ వజ్రోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హృదయ్ కుమార్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో సెయింట్ ఆల్ఫోన్సస్ ఉన్నత పాఠశాల స్థాపించి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 31వ తేదీన వజ్రోత్సవం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హృదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1965లో పాఠశాలను స్థాపించినట్లు తెలి పారు. వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరవు తారని తెలిపారు. ప్రత్యేక అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేంద ర్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఏ. రాజశేఖర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమా ర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్ హాజరవు తారని తెలిపా రు. సమావేశంలో సెయింట్ ఆల్ఫోన్సస్ ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జి కేథరీన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, జిలానీ, స్పర్జన్, పాఠశాల ఉపాధ్యాయులు బాలశౌరిరెడ్డి, జయంత్‌కుమార్, సుందరి, లూర్దురెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఏచూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు ఉన్నారు.

గోదావరి జలాలకు అడ్డుకట్ట తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోత్కూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బిక్కేరు వాగులో గుండాల మండలం అనంతారం బ్రిడ్జి వద్ద గోదావరి జలాలు దిగువకు వెళ్లకుండా కొందరు వేసిన అడ్డుకట్టను నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం తొలగించారు. 'గోదావరి జలాలకు అడ్డుకట్ట' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచు రించిన కథనానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి మధ్యాహ్నం అనంతారం బ్రిడ్జి వద్ద సిమెంట్ బస్తాలతోవేసిన అడ్డుకట్టను తొలగింపజే యించారు. వాగుకు ఇరువైపులా ఉన్న గ్రామాల రైతుల బిక్కేరువాగులో వేసుకున్న చేతిబోర్లతో పంటలు సాగు చేస్తు న్నారు. బిక్కేరు వాగులో నీరుంటే వాగు సమీపంలో ఉన్న బావులు, బోర్లలో కూడా భూగర్భజలాలు పెరుగుతాయి. బిక్కేరు వాగులో ఉండే నీటిని నమ్ముకునే రైతులు యాసంగి వరినాట్లు వేశారు. ఈసారి భారీ వర్షాలు కురవకపోవడంతో యాసంగి పంటలు ఎండిపోకుండా ఆలేరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఇటీవల గంధమల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు విడుదల చేయించారు. అవి గుండాల మండలం అనంతారం వరకు వచ్చాయి. అనంతారం బిక్కేరు బ్రిడ్జి వద్ద ఈనెల 28న కొందరు గడ్డి మోపులు, గడ్డకట్టిన సిమెంట్ బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ఎమ్మెల్యే చొరవతో వాటిని తొలగించారు. దీంతో నీరు దిగువకు వెళ్తోంది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూవులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,10,991ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నిత్యానందరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా వేద పండితులు వేద ఆశీర్వాదం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు.

సహకార ఎన్నికలు లేనట్టే(నా)?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు జరిగాయి. మరో 16 రోజుల్లోగా పాలకవర్గం గడువు ముగుస్తుంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా? పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తుందా? ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తుందా? అన్నది పీఏసీఎస్ పోటీ చేసే ఆశావాహుల్లో చర్చనీయాంశంగా మారింది. సహకార ఎన్నికలు కూడా వాయిదా పడనుండటంతో ఆశావాహుల్లో నిరాశ నెలకొంది.

పర్సన్ ఇన్‌చార్జీలా... పదవీకాలం పొడిగింపా..?

సహకార సంఘాలకు ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం కన్పించకపోవడంతో, వాటిని వాయిదా వేసే అవకాశం ఉందని సహకార సంఘాల వర్గాలు భావిస్తున్నాయి. పాలకవర్గాలు పదవీ కాలం ఫిబ్రవరి 15తో ముగియనుండటంతో ప్రభుత్వం పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించే అవకాశం ఉంది. అయితే పర్సన్ ఇన్‌చార్జీలు ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల బాధ్యులను... లేదంటే ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టతలేదు. మరోవైపు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల పదవీకాలం గడువు ఆరునెలల వరకు పొడిగించే అవకాశం లేకపోలేదని సహకార వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే గతంలో ఎన్నికైన మెజార్టీ పీఏసీఎస్ చైర్మన్లు బీఆర్‌ఎస్‌కు మద్దతుదారులుగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలామంది చైర్మన్లు, వైస్ చైర్మన్లు కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించని పక్షంలో పదవీ కాలాన్ని పొడిగించాలన్న విజ్ఞప్తిని ప్రభుత్వానికి చేసే అవకాశం ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని జిల్లాల్లో పరిస్థితులను పరిశీలించిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

కొత్తగా మరికొన్ని పీఏసీఎస్‌లు

ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌లకు తోడుగా... కొత్తగా సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సహకార శాఖ కమిషనర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నూతనంగా ఏర్పాటు చేసే పీఏసీఎస్‌ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీచేసింది. సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సంఘాల జాబితాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపింది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107పీఏసీఎస్‌లు ఉండగా, నల్లగొండ జిల్లాలో 42, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21, సూర్యాపేట జిల్లాలో 44వరకు పీఏసీఎస్‌లు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో కొత్తగా దాదాపు 5 పీఏసీఎస్‌లు, నల్లగొండ, సూర్యాపేటలో నూతనంగా మరో 16 వరకు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. సహకార సంఘాలు పెరగనున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. చట్టబద్దంగా ప్రస్తుతం ఉన్న సంఘాలనుంచి గ్రామాలను విడదీసి కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు వెలువడగానే వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు కొత్త సంఘాల ఏర్పాటుపై కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ఇందుకు సంబంధించిన సహకార సంఘాల అధికారులను సంప్రదించగా, నూతనంగా ఏర్పడనున్న పీఏసీఎస్‌ల జాబితాను ప్రభుత్వానికి పంపామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదని వెల్లడించారు.

క్రీడా, సాంస్కృతికోత్సవాలకు ఆట స్థలాలు సిద్ధం

● ఫిబ్రవరి 8 నుంచి మోత్కూరులో ప్రారంభం

మోత్కూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మో త్కూరు మండల కేంద్రంలో ఫిబ్రవరి 8, 9, 10వ తేదీల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా, ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలకు స్థానిక ఉన్నత పాఠశాలలో, మినీస్టేడియం స్థలంలో ఆట స్థలాలు, వేదికల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. క్రీడా ప్రాంగణాలను మట్టిపోసి చదును చేశారు. కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. వాలీబాల్ రాష్ట్ర ఆర్టీసీ కోచ్ కృష్ణారెడ్డి, రిటైర్డు పీడీ సోమనర్సింహారెడ్డి, నయీమ్, స్థానిక ఎంఈవో టి. గోపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్, ఎస్ఎన్‌చారి, డి. అరవిందరాయుడు, ఎ. అవిలిమల్లు, టి. ఉప్పలయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గుండగోని రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో యూరియా నిల్వల పరిశీలన

● స్టాక్ ఉన్నా సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంపై ఆగ్రహం



గోదాంలో యూరియా పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెన్‌పహాడ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండలపరిధిలోని అనంతారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద సమయానికి సిబ్బంది రాకపోవడంతో రైతులు క్యూలో చెప్పులు పెట్టారు. దీనిపై 'యూరియా కోసం ఉదయం నుంచే నిరీక్షణ' శీర్షికన ఈ నెల 28వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి స్పందించారు. అనంతారం పీఏసీఎస్‌ను మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. యూరియా నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. యూరియా రైతులకు సరిపోను స్టాక్ ఉన్నప్పటికీ సిబ్బంది సమయపాలన పాటించక పోవడంపై జిల్లా వ్యవసాయాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిపై కలెక్టర్, డీఎస్‌వోలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణ లేకపోవడం మూలంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయనకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. యాసంగి సీజన్‌లో ఎలాంటి యూరియా కొరత లేదన్నారు. యూరియాకు వచ్చిన రైతులం దరినీ పీఏసీఎస్ సమీపంలో ఉన్న రైతు మామిడి బిక్షం వరిక్షేత్రంలోకి తీసుకువెళ్ళి యూరియా వరిలో వాడు విధానంపై అవగాహన కల్పించారు. యూరియా ఎక్కువగా వాడడం వల్ల అగ్గి తెగులు, ఆకుముడత తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు యూరియా మీద ఆధారపడకుండా పశువుల ఎరువు, పచ్చి రొట్ట ఎరువులైన జిలుగు వాడి భూసారాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, విస్తరణ అధికారి శ్రావణి, సిబ్బంది లక్ష్మారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో చాకలిగట్టుకు పర్యాటక సొబగు!

● నాగార్జున సాగర్ మధ్యలో ఉన్న నదీ ద్వీపం చాకలిగట్టు

● ఇటీవలే పర్యటించిన రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు

● పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలపై అధ్యయనం

హైదరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ మధ్యలో ఉన్న నదీ ద్వీపం చాకలిగట్టును రూ.15కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర పర్యాటకశాఖ ఉన్నతాధికారుల బృందం ఇటీవలే చాకలిగట్టును సందర్శించి ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసింది. చాకలిగట్టు ద్వీపం.. నాగార్జున కొండకు కేవలం 3కిలోమీటర్ల దూరంలోనే ఉంది. నాలుగు వందలకు పైగా ఎకరాల్లో ఎత్తైన వృక్షాలతో, దట్టమైన పొదలతో విస్తరించింది. ఈ నేపథ్యంలో నాగార్జున కొండ నుంచి చాకలిగట్టుకు రోప్‌వే, బోటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని, ద్వీపం అంతా కొండ ప్రాంతమైనందున ట్రెక్కింగ్ ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. మధ్య, కొత్త రాతి యుగాల్లో చాకలిగట్టు ప్రాంతం ఆదిమానవుల ఆవాసంగా ఉందని పురావస్తు నిపుణులు గుర్తించారు. దీంతో, పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా గతంలో ఈ ప్రాంతంలో లభ్యమైన పురాతన వస్తు సామగ్రి, బౌద్ధ శిల్పాలు, నాణేలతో ఇక్కడ ఒక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. జింకలు, ఇతర జంతువులతో మినీ జూ పార్కును కూడా ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. కుటుంబాలతో వచ్చే పర్యాటకుల విడిది కోసం కాటేజీలను నిర్మించనున్నారు. చాకలిగట్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే.. బుద్ధవనం, నాగార్జున కొండల, చాకలిగట్టులను కలిపి పర్యావరణ పర్యాటక సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పర్యావరణ హితంగా ఈ ప్రాజెక్టుకు కొనసాగించేందుకు కేంద్రం కూడా నిధులు మంజూరు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది.

డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలి

● రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్



నాగార్జునసాగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

దేవరకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే ఓపీ సంఖ్య, డెలివరీ వివరాలు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవిప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆక్సిజన్ ప్లాంట్, రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల నుంచి 200పడకల ఆస్పత్రిగా పెంచనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రికి ఆర్వోప్లాంట్‌తో పాటు డెంటల్ బెడ్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం రోగులకు సరిపడా మందులు పంపిణీ చేస్తుందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని, సాకులు చెప్పి వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేయవద్దని డాక్టర్లను ఆదేశించారు. తెలంగాణలో 175 ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయని ఆస్పత్రిలో త్వరలో 1600డాక్టర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్, డాక్టర్ మంగ్తానాయక్, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కాన్పుల్లో సిజేరియన్లు తగ్గించాలి

నాగార్జునసాగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులకు వచ్చే మహిళలకు సిజేరియన్ డెలివరీల సంఖ్య తగ్గించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వైద్యులకు సూచించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఏరి యా ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల డీసీహెచ్‌లు, సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ, ఆర్ఎంవో భానుప్రసాద్‌నాయక్, నల్లగొండ డీసీహెచ్ఎస్ మాతృనాయక్, సూర్యాపేట డీసీహెచ్ వెంకటేశ్వర్లు, యాదాద్రి డీసీహెచ్ చిన్నానాయక్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భిక్షపతి రావు, అధ్యాపకులు, విద్యార్థులు

నల్లగొండ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని టీజీఎస్‌బీ డీఎస్పీ భిక్షపతి రావు అన్నారు. యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నల్లగొండ ఒకేషనల్, జూనియర్ కళాశాలలో వేర్వేరుగా మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహనకార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం పరిణామాలు. దుష్ప్రభావాలు, సైకోట్రోపిక్ పదార్థా దుష్ప్రభావాల గురించి వివరించారు.మాదకద్రవ్యాల వినియోగం, రవాణా గురించి ఎవరైనా టీజీఎస్‌బీ టోల్ ఫ్రీ నంబర్ 1908 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెరుగు రాకేంద్, కళాశాల అధ్యాపకులు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్యమతస్థులకు దేవస్థానం దుకాణాలు ఇవ్వొద్దు

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్యమతస్తులకు దేవస్థానం పరిధిలో నేరుగా లీజు, సబ్ లీజుగా కాని ఇవ్వవద్దని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సంగపాక రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే దేవస్థానంలో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం కనపడుతోందని భక్తులకు అసౌకర్యంగా ఉంటోందని పేర్కొన్నారు. సమస్యకు వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సమితి జిల్లా ఇంచార్జ్ బొడ్డుపల్లి వెంకటేశ్, క్రాంతికుమార్, శివ, మహేశ్, కార్తీక్ అంజిలు ఉన్నారు.

వెయ్యి గొంతులు..లక్ష డప్పుల కమిటీ

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ల సాధన కోసం మంద కృష్ణ నిర్వహించతలపెట్టిన లక్ష గొంతులు..వెయ్యి డప్పుల కోసం ఎలారెడ్డిగూడెం కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఇంద్రకంటి ఈశ్వర్, ఉపాధ్యక్షుడిగా దండు లింగయ్య, మేడి గణేశ్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి రవి, కార్యదర్శి పందిరి మహేశ్, సంయుక్త కార్యదర్శి దండు జైరామ్, ప్రచార కార్యదర్శి దండు కృష్ణ, కోశాధికారి సిర్పంగి దిలీప్‌కుమార్ కార్యవర్గ సభ్యులుగా శంకర్, సుదర్శన్, ఉపేంద్ర, బాలస్వామి, ప్రసాద్, నవీన్, ఎల్లేశ్, రామలింగయ్య, దేవి కుమార్, ఎల్లయ్య, కృష్ణయ్యతో కమిటీని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత



మోడల్ స్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేస్తున్న రేపాల మదన్ మోహన్

శాలిగౌరారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను ఉమ్మడి నల్లగొండ- ఖమ్మం జిల్లాల లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్, యూత్ ఎంఎవర్‌మెంట్, ట్రైనర్, లయన్ పీఎంజేఎఫ్ రేపాల మదన్ మోహన్ రేపాల మదన్ మోహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాట క్రీడలు ఎంతో అవసరమన్నారు. చాలా పాఠశాలలో క్రీడా వస్తువులు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారన్నా ఉద్దేశంతో తాను సొంత ఖర్చులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 221 ప్రభుత్వ పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశానన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యానారాయణ, చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, ఫ్టాస్ జోన్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, సభ్యులు దునక వెంకన్న, గుండ్ల రామ్మూర్తి, నల్లగొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల పిచ్చయ్య, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యా రాణి, ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, కుక్కడపు శ్రీనివాస్, స్కూల్ పీడీ బొడ్డు మల్లేష్, ఉపాధ్యాయులు కేతేపల్లి శ్రీనివాస్, దామెర్ల కృష్ణయ్య, సంపత్ కుమార్, శ్రీరాములు, అనురాధ, సంగీత, సంధ్య, సృజన, శ్వేత, స్వప్న, తండు అంజనేయులు, యూనస్, రవి, వేణు, జీబున్నీస, సరస్వతి, సువర్ణ, పావని, రాజు, వెంకటయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: సీపీఎం

కేతేపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్. లూర్దుమారయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రం కేతేపల్లిలో నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. ఆత్మీయ భరోసాను ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా భూమిలేని పేదలందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పక్కదారి పట్టకుండా చూడడంతో పాటు విడతవారీగా కాకుండా గ్రామాల్లోని అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏళ్ళ అశోక్‌రెడ్డి, వి.సౌడయ్య, బి.అంజయ్య, జె.పిచ్చయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ అభినందనీయం



స్టడీ మెటీరియల్స్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మర్రిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథంతో పీఆర్ఆర్ ఫౌండేషన్ వారు ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేయడం అభినందనీయమని పంచాయతీరాజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శా ఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవనంలో పీఆర్ఆర్ స్టడీ మెటీరియల్‌ను సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆమె ఆవిష్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ తెల్లం పాండురంగారావు ఇలాంటి ఆలోచనలు చేయడం సంతోషకరమన్నారు. విద్యతో పాటు సామాజిక అంశాలపైన మరెన్నో కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులను చైతన్యవంతులను చేయాలన్నారు. ఫౌండేషన్ వారు అందిస్తున్న మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట పీఆర్ఆర్ జనరల్ సెక్రటరీ సోమ జ్యోతి, తెల్లం వెంకటేష్, శివాని ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ అందించాలి

మర్రిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామ చంద్రం అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర రైతు సంఘం మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులు తీసుకున్న రూ. 2 లక్షలు పైబడిన రుణమాఫీ చేయాలన్నారు. రైతుభరోసా సాగుకు యోగ్యమైన భూములకు తక్షణమే అందించాలన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, డ్రిప్పు సబ్సిడీతో ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా రైతు సంఘం కోశాధికారి బుర్ర శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి బిక్షంరెడ్డి, ఆకుల రఘుమయ్య, యాదయ్య, వెంకటయ్య, శేఖర్‌లు ఉన్నారు.

రోడ్డు విస్తరణలో ముందు చూపులేక..





రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ



నల్లగొండ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముందుచూపుతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం హడావుడి చేసి, రోడ్డు విస్తరణ పేరుతో ఆ ప్రాంత వాసులందరినీ భయభ్రాంతులకు గురి చేశారు. నిర్మాణ లోపాలతో మార్గం గుండా వెళ్లే వాహనదారులు సైతం నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లన్నింటినీ విస్తరించాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్, బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, గొల్లగూడ, పెద్దబండల మీదుగా కలెక్టరేట్ వరకు పనులు చేపట్టారు. వివిధ కారణాలతో బస్టాండ్ నుంచి గొల్లగూడ వరకు రోడ్డు విస్తరణను అప్పట్లో పూర్తిచేయలేకపోయారు. మిగితా ప్రాంతాల్లో పూర్తిచేశారు. కాగా గొల్లగూడ- అవుట్‌డోస్టేడియం- పెద్దబండ సెంటర్‌ల మీదుగా పూర్తి చేసిన పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వం కన్పిస్తోంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

గొల్లగూడ నుంచి కలెక్టరేట్ వరకు విస్తరించిన రోడ్డు పనుల్లో సదరు కాంట్రాక్టర్ , అధికారుల ముందు చూపు లేమి కారణంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మేకల అవుట్‌డోర్ స్టేడియానికి ఎదురుగా రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం, దీనికి తోడు ఆ పక్కనే ఉన్న డ్రైనేజీని విస్తరించక పోగా ఉన్నంతలోనే నిర్మించడం ఇబ్బందికరంగా మారింది. దీంతో నిత్య ప్రమాదాలకు నెలవుగా మారింది. రాత్రి వేళలో ప్రయాణించే వారు అనేక సందర్భాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు రోడ్డుపై అవగాహన లేమి కారణంగా రోడ్డు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి.

మూల మలుపుల వద్ద నియంత్రణ కరువు

రోడ్డు మూల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డుల ఏర్పాటును విస్మరించారు. దీంతో నిత్యం గొల్లగూడ- అవుట్‌డోర్ స్టేడియం- పెద్దబండ- కలెక్టరేట్ రోడ్డు మార్గంలో ఎక్కడో ఓ చోట ప్రమాదం చోటుచేసుకుంటుంది. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు నిత్యం ప్రయాణించే ఈ మార్గంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



రోడ్డు విస్తరణ చేపట్టి ఏడాదికి పైగా అయింది. అయినా నేటికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పరచకపోవడంతో వేగంగా వస్తూ మూలమలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ అనేక మార్లు అధికారులకు విన్నవించాం. ఎలాంటి ఫలితం లేదు. అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

● కె. రవికుమార్.

మొక్కు చెల్లించుకున్న మాజీ సర్పంచ్

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలిస్తే చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.5లక్షల విరాళం అందజేస్తానన్న మొక్కును ఆయన శిష్యుడు, భువనగిరి యాదాద్రి జిల్లా కొండమడుగు మాజీ సర్పంచ్ సుర్వి వేణుగౌడ్ బుధవారం తీర్చుకున్నారు. బుధవారం చెర్వుగట్టుకు వచ్చి దేవస్థానం పేరిట రూ.5లక్షల (నిత్యాన్నదానం విరాళం) చెక్కును దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జ్ఞాపకార్థం దేవవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తే యాదగిరిగుట్ట దేవస్థానానికి కూడా రూ.5లక్షల విరాళం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిగూడెం మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ వేణుగౌడ్

రోడ్డు భద్రత మనందరి బాధ్యత



రోడ్డు భద్రతా నిబంధనలు సూచికల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎన్.వాణి, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ సహకారంతో రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కామినేని వైద్య విద్యా కళాశాలలో బుధవారం రోడ్డు సేఫ్టీ అనే అంశంపై మెడికల్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రోడ్డుపై వాహనాలను నడిపే టప్పుడు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. పగలు-రాత్రి వేళల్లో వాహనాలు నడ పాల్సిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమని ద్విచక్రవాహన దారులు విధిగా డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు.

రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ జీరో యాక్సిడెంట్‌లకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. రవాణా శాఖలో అనుభవజ్ఞులైన విశ్రాంత అధికారుల ద్వారా రోడ్డు భద్రతా సూచనలపై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. అన ంతరం రోడ్డు భద్రత, సూచిక బోర్డులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ కుడగీ, విశ్రాంత ఆర్‌టీవీ విజయ్‌పాల్‌రెడ్డి, ఎంవీఐలు లావణ్య, సీహెచ్.కొండయ్య, మల్లికార్జున్‌రెడ్డి, చంద్ర శేఖర్‌గౌడ్, స్వప్నరెడ్డి, ఏఎంవీఐలు భాస్కర్‌రెడ్డి, సోని, కిరణ్, బాబు పాల్గొన్నారు.

బీజీటీ రోడ్ల పునర్నిర్మాణానికి రూ. 5.54 కోట్లు

శాలిగౌరారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీరాజ్ ఎంఆర్ ఆర్ గ్రాంట్ కింద తారు రోడ్ల పునర్నిర్మాణా నికి రూ.5.54 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి బుధ వారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాలిగౌరారం అంబేద్కర్ చౌరస్తా నుంచి భైరవుని బండ వరకు 9 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.25 కోట్లు భైరవునిబండ నుంచి అమ్మనబోలుకు 5.20 కిలోమీటర్లు రూ.1.31 కోట్లు గురజాల నుంచి ఉప్పలంచ వరకు 8 కిలోమీటర్లకు రూ.1. 98 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

టూల్‌డౌన్‌ను జయ ప్రదం చేయాలి

చిట్యాల, జనవరి29, (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు చిట్యాల మండల వ్యాప్తంగా ఎలక్ట్రీషియన్ వర్కర్స్, ప్లం బర్స్, టైల్‌వర్కర్స్, మార్బుల్ వర్కర్స్ టూల్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని దానికి ప్రజలు సహకరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. బుధవారం చిట్యాలలో టూల్‌డౌన్ ప్రచార పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగణంగా రేట్లను సవరించడం కోసం, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధిని దూరం చేస్తు న్నందుకు నిరసనగా టూల్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్ రాష్ట్ర గౌరవ సలహా దారు కంభంపాటి నర్సింహ, జిల్లా అధ్యక్షుడు వరికుప్పల హనుమంతు, చిట్యాల మండలాధ్యక్షుడు బరాల స్వామి, పాల నర్సింహ, మంచాల గణేష్, బెల్లి యాదయ్య, తాడూరి చంద్రం, నీల కంఠం లింగస్వామి పాల్గొన్నారు.

డీఎస్పీ మండలాధ్యక్షుడిగా మారయ్య

గట్టుప్పల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల మం డల కమిటీ బుధవారం ఎన్నుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడిగా భీమనపల్లి మారయ్య మహారాజు ఎన్ని కయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బొట్టా రాంబాబు, ఉపాధ్యక్షుడు గూడెపు మహేష్, మాతంగి ఆనంద్, బరిగల అజయ్ కుమార్, కట్ట ప్రభాకర్ మండల కమిటీ సభ్యులు తిరిగి కృష్ణను ఎన్ను కున్నారు.



మారయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ నాయకులు


బీఆర్ఎస్ హయాంలో జిల్లాకు తీరని అన్యాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్

కనగల్, జనవరి 29: (ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చోటు జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. స్థానికంగా బుధవారం కాంగ్రెస్‌నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కేటీఆర్ దుష్ప్రచారం చేయటం సిగ్గు చేటన్నారు. రైతు రుణ మాఫీ 25 శాతం మందికి అయ్యిందని ఇంకా 75 శాతం మంది రైతులకు కాలేదని ఆరోపించటం హాస్యా స్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం రూ. 2 లక్షల లోపు రుణాలన్నింటిని ప్రభుత్వం మాఫీ చేసిందని వివరించారు. సాంకేతిక సమస్యల కారణంగా కేవలం 20 శాతం మంది రైతులకు వర్తించలేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే అర్హత కేటీఆర్‌ది కాదని హితవు పలికారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కోమటిరెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి జగాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టీఏ మెంబర్ రాజారెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు బోగరి రాంబాబు, గోగు యాదయ్య, నెలుగుందరాశి ముత్తయ్య సింగం పెద్దులు, నాయకులు పగిడిపాటి సత్తయ్య, దిలీప్‌రెడ్డి, రాములు, రాయల శ్రవణ్, ముద్దం ప్రసాద్, ఆవుల పరమేష్, కొంపెల్లి శంకర్, సైదులు, శ్రీహరి తదితరులున్నారు.

ఉపాధి సిబ్బంది జీతాలు వెంటనే విడుదల చేయాలి



శాలిగౌరారం: ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

శాలిగౌరారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని శాలి గౌరారం ఏపీవో జంగమ్మ, ఈసీ వెంక టాచారి కోరారు. ఈమేరకు బుధ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ గాదరి సుంద రయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మూడు నెలల నుంచి జీతా లు లేక అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎర్ర బుచ్చయ్య, బట్ట సైదులు, ఎర్ర యాదగిరి, ఇంద్రక ంటి సైదులు, ఉపేందర్, యానాల లింగమ్మ, నీరజ, విజయ, సుజాత, రామాంజమ్మ ు పాల్గొన్నారు.

●కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్ రావుకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ ఉద్యోగులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో చలపతి, ఏపీవో కడియం రాంమోహన్, నాగభూషణం, రాణి, విజయలక్ష్మి, వెంకన్న, దాసరి యాదగిరి ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలి

కనగల్, జనవరి 29: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలకు అర్హులందరికీ ఇవ్వాలని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోబుధవారం తహసీల్దార్ పద్మకు వినతి పత్రం అందించారు. ప్రజలకు అందు బాటు లో ఉండి ఉత్తమ సేవలు అందించేలా కార్యా లయ సిబ్బందికి తగు ఆదేశాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో గోలి జగాల్‌రెడ్డి, హఫీజుద్దీన్ దేప వెంకట్‌రెడ్డి, రాంబాబు, పగిడిపాటి సత్తయ్య తదితరులున్నారు.

రామలింగేశ్వరుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవ మూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చక స్వాములు

నార్కట్‌పల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామ లింగేశ్వర స్వామి దేవస్థానంపై లక్ష పుష్పార్చన బుధవారం ఘనంగా నిర్వహించారు. మౌని అమావాస్యకు ప్రత్యేకత ఉండటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వాహనాలు, బస్సుల ద్వారా చేరుకున్నారు. రద్దీ దృష్ట్యా వాహనాలను ఘాట్‌రోడ్‌పై అనుమతించ లేదు. పార్కింగ్ ప్రదేశాల్లోనే ఆపి ఆటోల్లో పైకి చేరారు. కాగా గర్భాలయం నుంచి మంగళ వాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల మధ్య శివ పార్వతుల ఉత్సవ మూర్తులను మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సతీశ్ శర్మ, సురేశ్‌శర్మలచే పుష్పాలకు పూజాదికాలు నిర్వహించి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలందుకున్న పుష్పాల కోసం భక్తులు ఎగబడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించి భక్తులు పార్వతీ జడల రామలింగేశ్వరుడితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. గుమ్మడి కాయల పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. మౌని అమావాస్య కావడంతో ఉదయం నుంచే భక్తుల రాక కనిపించింది. దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ అమరేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి ఆర్టీసీ ఉద్యోగులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ రీజియన్ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు బాధ్యతతో పాటు ప్రయాణికుల భద్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రీజినల్ మేనేజర్ జాన్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ఉద్యోగులతో పాటు ప్రయాణికుల క్షేమంగా ఉండాలనే ఉద్దేశంతో ఆర్టీసీ సంస్థ రోడ్డు భద్రత మహోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అనం తరం ఆర్టీసీ ఉద్యోగులు 105 యూనిట్స్ రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీసీ అధి కారులు మాధవి, శివశంకర్, డిపో మేనేజర్ శ్రీనాథ్, ఎన్నమల్ల అంజయ్య, నేతి విప్లవ కుమార్, సద్దాం హుస్సేన్, రాములు ఉన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
***



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 18.4



సహకార ఎన్నికలు లేనట్టేనా?

- ఫిబ్రవరి 15తో పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పదవీకాలం ముగింపు
- సంఘాల్లో కనిపించని ఎన్నికల హడావుడి
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు
- ఆశావహుల్లో నిరాశ

యాదాద్రి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశం లేదనే అంశంపై చర్చ మొదలైంది. ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయం వెలువడకపోవడంతో ఇప్పట్లో జరగవని, స్థానికంగా ఉన్న ఆశావహులు మదనపడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార(పీఏసీఎస్)సంఘాల్లో ఎన్నికల హడావుడి కన్పించడంలేదు. పీఏసీఎస్ సంఘాల పాలకవ ర్గం గడువు మరికొద్ది రోజుల్లో ముగియనుంది. సహకార సంఘాల సభ్యుల్లో ఎన్నికల కోలాహ లం కన్పించడం లేదు. సాధారణంగా పాలకవ ర్గం గడువు ముగుస్తుందన్న ఆరు నెలల ముం దుగానే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాలి. ఫిబ్రవరి 15వ తేదీతో పీఏసీఎస్‌లు, డీసీసీబీ, డీసీఎంఎ్‌సల పాలకవర్గం గడువు ముగుస్తున్నప్పటికీ, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎ లాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఎన్నికలు ఇప్పుడు జరగనట్టేనని రైతుల్లో సర్వత్రా చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల మాదిరిగానే సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని స్థానికం గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పలు పార్టీలకు చెందిన నేతలు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లున్నాయి. నల్లగొండ జిల్లాలో 42, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21, సూర్యాపేట జిల్లాలో 44వరకు పీఏసీఎస్‌లు ఉన్నాయి. 2020ఫిబ్రవరి 15నజిల్లా కేంద్ర సహకార బ్యాం కు(డీసీసీబీ)జిల్లా సహకార మార్కెటింగ్ సహకార సంస్థ(డీసీఎంఎస్) చైర్మన్, వైస్‌చైర్మన్..

- మిగతా 7వ పేజీలో...



మోగిన నగారా

శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. బుధవారం ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించింది. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారని, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపడతారని తెలిపింది. ఇందుకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదేరోజు నుంచి ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫిబ్రవరి 11న నామినేషన్లను పరిశీలిస్తారు. ఫిబ్రవరి 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు విధించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. మార్చి 3న ఓట్లను లెక్కిస్తారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)


- ఫిబ్రవరి 27న టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- 24,905 మంది ఓటర్లుగా నమోదు
- ప్రచారం వేగం పెంచిన అభ్యర్థులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఎవరికనేదానిపైనే ఆసక్తి



జిల్లా	మండలాలు	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	మహిళలు	మొత్తం
1. సిద్దిపేట	4	4	120	43	163
2. జనగాం	12	12	556	365	921
3.హనుమకొండ	11	15	2884	2214	5098
4.వరంగల్	13	13	1381	844	2225
5.మహబూబాబాద్	18	16	1083	535	1618
6.జె.భూపాలపల్లి	7	7	211	112	323
7.ములుగు	9	9	394	218	612
8.భద్రాద్రికొత్తగూడెం	23	23	1038	911	1949
9.ఖమ్మం	21	24	2300	1655	3955
10.యాదాద్రి	17	17	595	326	921
11.సూర్యాపేట	23	23	1690	947	2637
12.నల్లగొండ	33	37	2688	1795	4483
మొత్తం	191	200	14,940	9,965	24,905

రాష్ట్రంలో చైతన్యవంతమైన ప్రాంతంగా పేరున్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో గెలవడం ద్వారా తమ ఉనికిని, సత్తా చాటాలని భావించిన ఉపాధ్యాయ సంఘాలు ఇక్కడ ఇప్పటికే అభ్యర్థులను ఎంపికచేసి ప్రచారం హోరెత్తిస్తున్నాయి. యూటీఎఫ్ టీఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అందరికంటే ముందే ఆ సంఘం తమ అభ్యర్థిగా ప్రకటించి ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఒక వైపు నర్సిరెడ్డి విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తుంటే, ఆయన తరఫున యూటీఎఫ్ శ్రేణులు మండల కమిటీలు మొదలుకొని, జిల్లా కమిటీల వరకు అందరూ కార్యవర్గ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రచార దూకుడు పెంచారు. పీఆర్‌టీయూ టీఎస్ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించిన సంఘం ప్రచారాన్ని ఉధృతం చేసింది. అదేవిధంగా టీపీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సైతం అభ్యర్థిగా బరిలోకి వచ్చారు. ఆయన సైతం నియోజకవర్గంలో విస్తృతస్థాయిలో ప్రచారం కొనసాగిస్తూ తనకు అవకాశమివ్వాలని కోరుతున్నారు. టీజేపీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ మాజీ నేత పులి సరోత్తమ్‌రెడ్డిని ఆ పార్టీ అధికారికంగా ప్రకటించగా, తపస్ నేత తీగుళ్ల సాయిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. మరోవైపున పీఆర్‌టీయూ అభ్యర్థిగా 2013లో ఎమ్మెల్సీగా గెలుపొందిన పూల రవీందర్ జాక్టో అభ్యర్థిగా బరిలో ఉంటున్నారు. రిటైర్డ్ డీఈవో చంద్రమోహన్, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమవడంతో ఈ సారి...

- మిగతా 6వ పేజీలో...



సమయపాలన పాటించాలి

- హైరిస్క్ గర్భిణులను ఏరియా ఆస్పత్రికి తరలించాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


హాలియా, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. బుధవారం హాలియాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హైరిస్క్ ఉన్న గర్భిణులను ఎప్పటికప్పుడు ఏరియా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అదేవిధంగా హైరిస్క్ గర్భిణుల రిజిస్టర్లను నెలలవారీగా క్షుణ్ణంగా పరిశీలించి, గర్భిణుల్లో కొద్దిగా రిస్క్ ఉంటే వారిని వెంటనే ఏరియా ఆస్పత్రికి పంపించాలని డాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా ఓపీని మరింత పెంచే విధంగా సేవలు అందించాలని కోరగా, మరో 24 గంటలు ఆస్పత్రి నిర్వహణకు ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారని, మరో డాక్టర్ పోస్ట్ శాంక్షన్ లేదని, అదేవిధంగా స్టాఫ్ నర్సు మరొకరు ఉంటే ఆపరేషన్ చేయడానికి సులువుగా ఉంటుందని కలెక్టర్ దృష్టికి తేగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

అక్కడినుంచి కస్తూర్బా పాఠశాలకు వెళ్లి వంటశాలను, డైనింగ్ ఏరియాను పరిశీలించారు. వంటశాల, డైనింగ్ ఏరియాల్లో మరింత శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల క్లాస్ రూంలలోకి వెళ్లి ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానం చెప్పిన వారిని అభినందిస్తూ చాక్లెట్‌లను సైతం అందజేశారు. వారివెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ, తహసీల్దార్ రఘు, హాలియా పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, ఎస్‌వో హైమావతి తదితరులు ఉన్నారు.

కందుల మార్కెట్ ఏర్పాటు చేయాలి


దళారుల చేతిలో రైతులు మోసపోకుండా హాలియా మార్కెట్‌కు కందుల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా మండల సర్వేయర్‌ను కూడా నియమించాలని, మార్కెట్ కోనుగోలు కేంద్రంలో నిర్వహణ ఐకేపీ, పీఏసీఎస్ వారికి అప్పగించకుండా, మార్కెట్ సిబ్బందికే అప్పగించాలన్నారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

మాడ్గులపల్లి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మండల పరిధిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. మాడ్గులపల్లి మండలం నుంచి ఎక్కువ మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో వినతులు సమర్పిస్తున్నారని, మండల పరిధిలో పరిష్కారమయ్యే రైతులు సమస్యలను ఇక్కడే పరిష్కరించాలనిన్నారు. అధికారులు సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కాగా తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ త్వరలోనే నూతన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు. ఆమెవెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ సురేష్, ఆర్ఐ రేణుక ఉన్నారు.



పెండింగ్ వేతనాలివ్వకపోతే సమ్మె!

- ఫిబ్రవరి 12 డెడ్‌లైన్ విధించిన ఉపాధి పథకం సిబ్బంది
- నల్లబ్యాడ్జీలతో కొనసాగిన నిరసనలు
- పేస్కేల్ హామీ అమలుచేయాలనే విన్నపం
- ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావం
- సమ్మెకు వెళితే కీలక పనులకు ఆటంకమే



నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది నిరసనల బాటపట్టారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీలోగా పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జేఏసీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 12 వరకు అంచలంచెలుగా విన్నపాలు అందించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్లాలని జేఏసీ నిర్ణయించింది. ఉపాధి పథకం సిబ్బంది సమ్మెకు వెళితే కీలకమైన ఉపాధి పనుల జాతర, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక వంటి కీలక పనులపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీర్ కన్సల్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు...

- మిగతా 6వ పేజీలో...

సమృద్ధిగా ఎరువులు

● జేడీఏ శ్రవణ్ కుమార్

నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎప్పటికప్పుడు ఎరువుల లభ్యతపై సమీక్ష నిర్వహిస్తున్నారని, రైతుల ప్రయోజనం దృష్ట్యా నెలవారీగా కేటాయింపులకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు జేడీఏ శ్రవణ్ కుమార్ తెలిపారు. 2024 -25 యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 3,92,250 ఎకరాలల్లో వరి, 24,110 ఎకరాల్లో వేరుశనగ, 2,057 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయన్నారు.

జిల్లాలో ప్రస్తుతం 38,683 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా, ఇందులో యూరియా 17,475 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,500 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 7,700 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే కలెక్టర్ పలుచోట్ల ఆకస్మిక తనిఖీ నిర్వహించి, డీలర్లు ఎలాంటటి కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారని వివరించారు.

కేటీఆర్.. మీ నాయనను తీసుకొని రా

- గడియారం సెంటర్‌కు మంత్రి కోమటిరెడ్డి చర్చకు వస్తారు
- డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్



శిలాఫలకం ఫొటో చూపుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, చిత్రంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్.. మీ నాయనను తీసుకొని రా.. గడియారం సెంటర్‌కు మంత్రి కోమటిరెడ్డి చర్చకు వస్తారు అని డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ సవాల్ విసిరారు. కుర్చీ వేసుకొని ప్రాజెక్టులన్నీ పూర్తి చేయిస్తానని కేసీఆర్ మాట తప్పారని నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పి ఒక్క రోడ్డును పూర్తి చేయడం తప్ప జిల్లా కేంద్రంలో వేసిన శిలాఫలకాలు నవగ్రహాలుగా మారి ఉత్సవ విగ్రహాలు అయ్యాయని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లతో కలిసి శంకర్ నాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. నల్లగొండలో రైతు మహాధర్నాలో కేటీఆర్ ఈవెంట్ షోను నిర్వహించి అబద్ధాలు చెప్పి వెళ్లిపోయారని, ఆయన సభకు జనం కరువయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మీ నాయన కేసీఆర్‌ను తీసుకొని నల్లగొండకు వస్తే గడియారం సెంటర్‌లో చర్చకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని, దీనికి కేటీఆర్ సిద్ధం కావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండకు ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదని, జీవో లేకుండా, ఎస్టిమేషన్ లేకుండా పరిపాలన అనుమతులు లేకుండా కాగితాలపైనే నిధులు మంజూరైనట్లు చేశారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పేరు ఎక్కడ వస్తుందోనన్న ఆలోచనలో బీఆర్ఎస్ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి బ్రాహ్మణవెల్లెంలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు.

గడీల పాలన సాగించిన కేసీఆర్

కేసీఆర్ గడీల పాలన సాగించాడని, ప్రాజెక్టుల పేరున తండ్రి, కొడుకులు దోచుకున్నారన్నారని శంకర్ నాయక్ అన్నారు. గడియారం సెంటర్ అంటేనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డా అని, ఆ సెంటర్‌లోనే తెలంగాణ సాధనకోసం అమరణ దీక్ష చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో డిండి ప్రాజెక్టు, శివన్నగూడెం, నెల్లికల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. మంత్రులు కోమటిరెడ్డిని, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే కేటీఆర్ రైతు మహాధర్నా పేరిట నాటకం ఆడారన్నారు. జగదీష్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు చేసింది ఏమి లేదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, జూలకంటి శ్రీనివాస్, ఇబ్రహీం, జూలకంటి సైదిరెడ్డి, పిల్లి రమేష్, కత్తుల కోటి, వజ్ర రమేష్ పాల్గొన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు



రూ.15 కోట్లతో చాకలిగట్టుకు పర్యాటక సొబగు!

- నాగార్జున సాగర్ మధ్యలో ఉన్న నదీ ద్వీపం చాకలిగట్టు
- ఇటీవలే పర్యటించిన రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలపై అధ్యయనం

7



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అపరిష్కృత భూములను పరిశీలించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న భూముల ఖాతాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ధరణి తదితర భూసేకరణ సమస్యలపై పెండిగ్‌లో ఉన్న భూములపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా మండలంలో అపరిష్కృతంగా ఉన్న భూములకు సంబంధించిన ఖాతాలను పూర్తిస్థాయిలో విచారించి, వాటిని సైన్డ్ ఖాతాలుగా మార్చాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, వివాదాలుంటే పైఅధికారుల సూచనలు తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావును ఆదేశించారు. నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, విజయారెడ్డి, ఆర్ఐలు తరుణ్, భవాని పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, జనవరి 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలం శ్రీనాథపురంలోని శ్రీ కృష్ణ బీపీఈటీ కళాశాల మైదానంలో బుధవారం సాగర్ నియోజకవర్గ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఎస్‌పీఎల్-4ను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లుగా పంచాయతీ కార్యదర్శుల అధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అలాగే ఎమ్మెల్సీ కోటిరెడ్డిని నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాసీం, రాష్ట్ర కార్యదర్శి ఘనపురం నిరంజన్, సీనియర్ రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణరాజు, కొండలుయాదవ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా క్రీడాకారులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బుసిరెడ్డి పాండు రంగారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఘనపురం నిరంజన్, జిల్లా అధ్యక్షుడు ఎస్కే ఖాసీం, జిల్లా కార్యదర్శి జి.సతీష్, వర్భ్యా రమేష్, అనుముల కోటేష్, పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

చింతపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుజాత బుధవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో తమ పేర్లు నమోదు కాని వారికి మాత్రమే ఆధార్‌కార్డు, ధ్రువపత్రంతో పాటు, ఫొటో జతపరిచి నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆమె తెలిపారు.

ఇందిరమ్మ నమూనా ఇంటిని నిర్మించాలి



సమీక్షా సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులకు మంజూరు చేసే నమూనా ఇంటిని నిర్మించి ప్రదర్శనకు ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్, ఉపాధిహామీ అధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని అన్నారు. ఆత్మీయ భరోసా పథకంలో ఏ ప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంతో కూలీలకు పనిదినాలు తగ్గాయని అన్నారు. ఈ సారి ప్రతి కూలికీ వంద రోజులు పనిదినాలు కల్పించే విధంగా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మండల పరిషత్ ఖాళీ స్థలంలో ఇందిరమ్మ నమూనా ఇంటిని 40 రోజుల్లో నిర్మించి ప్రదర్శనకు ఉంచాలన్నారు. నమూనా చూసిన ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కలిగే చేయాలన్నారు. పథకాల అమలులో ప్రభుత్వానికి మచ్చతెచ్చే విధంగా తప్పిదాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను వినియోగించుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు చిలుకూరి శ్యామ్ అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన ప్రవేశ పెట్టిందన్నారు. చేతి వృత్తుల వారికి ఉచిత శిక్షణనందించడంతో పాటు వడ్డీలేని రుణా లందించే ఈ పథకాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో నాగాచారి, ఉపేందర్, శ్రీనివాస్, ఫణిందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో ముందు చూపులేక..





రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ



నల్లగొండ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముందుచూపుతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం హడావిడి చేసి, రోడ్డు విస్తరణ పేరుతో ఆ ప్రాంత వాసులందరినీ భయభ్రాంతులకు గురి చేశారు. నిర్మాణ లోపాలతో మార్గం గుండా వెళ్లే వాహనదారులు సైతం నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లన్నింటినీ విస్తరించాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్, బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, గొల్లగూడ, పెద్దబండల మీదుగా కలెక్టరేట్ వరకు పనులు చేపట్టారు. వివిధ కారణాలతో బస్టాండ్ నుంచి గొల్లగూడ వరకు రోడ్డు విస్తరణను అప్పట్లో పూర్తిచేయలేకపోయారు. మిగితా ప్రాంతాల్లో పూర్తిచేశారు. కాగా గొల్లగూడ-అవుట్‌డోర్‌స్టేడియం- పెద్దబండ సెంటర్‌ల మీదుగా పూర్తి చేసిన పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వం కన్పిస్తోంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరగుతున్నాయి.

రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

గొల్లగూడ నుంచి కలెక్టరేట్ వరకు విస్తరించిన రోడ్డు పనుల్లో సదరు కాంట్రాక్టర్ , అధికారుల ముందు చూపు లేమి కారణంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మేకల అవుట్‌డోర్ స్టేడియానికి ఎదురుగా రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం, దీనికి తోడు ఆ పక్కనే ఉన్న డ్రైనేజీని విస్తరించక పోగా ఉన్నంతలోనే నిర్మించడం ఇబ్బందికరంగా మారింది. దీంతో నిత్య ప్రమాదాలకు నెలవుగా మారింది. రాత్రి వేళలో ప్రయాణించే వారు అనేక సందర్భాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు రోడ్డుపై అవగాహన లేమి కారణంగా రోడ్డు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి.

మూల మలుపుల వద్ద నియంత్రణ కరువు

రోడ్డు మూల మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డుల ఏర్పాటును విస్మరించారు. దీంతో నిత్యం గొల్లగూడ- అవుట్‌డోర్ స్టేడియం- పెద్దబండ- కలెక్టరేట్ రోడ్డు మార్గంలో ఎక్కడో ఓ చోట ప్రమాదం చోటుచేసుకుంటుంది. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు నిత్యం ప్రయాణించే ఈ మార్గంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



రోడ్డు విస్తరణ చేపట్టి ఏడాదికి పైగా అయింది. అయినా నేటికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పరచకపోవడంతో వేగంగా వస్తూ మూలమలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ అనేక మార్లు అధికారులకు విన్నవించాం. ఎలాంటి ఫలితం లేదు. అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

● కె. రవికుమార్.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్రంపోడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 5 వరకు 400 కేవీ విద్యుత్ లైన్ దామరచర్ల నుంచి చౌటుప్పల్ వరకు నూతన లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీకాంత్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీదేవిగూడెం, తుర్కానిబావి గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గుర్రంపోడు, పోచంపల్లి, పిట్టలగూడెం, కొప్పుల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు 4 గంటలు త్రీఫేస్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. తిరిగి 4 గంటల అంతరాయాన్ని సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు అందిస్తామని వివరించారు.

ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రవిప్రకాష్



దేవరకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిప్రకాష్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ రాములునాయక్ ఆరు నెలల క్రి తం కల్వకుర్తి ఆసుపత్రికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ డాక్టర్ మంగ్తా నాయక్ బాధ్యతలు నిర్వహించారు. బుధవారం నుంచి దేవరకొండ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రవిప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతానన్నారు.

మునిసిపాలిటీల అభివృద్ధికి కృషి



హాలియాలో మునిసిపల్ మాజీ పాలకవర్గం సభ్యులతో ఎమ్మెల్యే రఘువీర్‌రెడ్డి

హాలియా, నాగార్జునసాగర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి): హాలియా, నందికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హాలియా, నందికొండ మున్సి పాలిటీ పదవివిరమణ పొందిన పాలకవర్గాల వీడ్కోలు సమావేశాల్లో అయన పాల్గొని మాట్లాడారు. కొత్త మునిసిపాలిటీకి ప్రస్తుతం మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తూనే సుందరీకరణ పనులను కూడా నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నందికొండలో మాట్లాడుతూ నేను కేవలం ఎమ్మెల్యేనే కాదు నందికొండ మునిసిపాలిటీలో ఒక ఓటరును అని చిన్నప్పటి నుంచి ఇక్కడే పెరిగి, సాగర్ వీధుల్లో ఆడుకున్నానన్నారు. మా నాన్న 35 ఏళ్ల రాజకీయ జీవితంలో సాగర్‌ను పలు విధాలుగా అభి వృద్ధి చేశారన్నారు. మొదటి సారీ కౌన్సిలర్లుగా ఎన్నుకోబడిన 12 మంది ప్రజా ప్రతినిధులు తమ వం తుగా ప్రజల సమస్యలను పరిష్కరించారన్నారు. నందికొండ మునిసిపాలిటీని ఎత్తేస్తారా అని కౌన్సిలర్లు ఎమ్మెల్యేలను అడగగా ప్రజాభీష్టం మేరకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిర్ణయం తీసుకుం టామన్నారు. హాలియా మునిసిపాలిటీలో కూడా ప్రజలు తమకు ఉపాధి హామీ పథకం వర్తించకపోవడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దూరమయ్యామని అందుకే మునిసిపాలిటీని ఎత్తేయాలని కోరినట్లు తెలిపారు. గతంలో నాగార్జునసాగర్‌ను నందికొండ మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, నోముల భగత్‌కు ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. పదవి విరమణ పొందిన కౌన్సిలర్లను వారు చేసిన సేవలను అభినందించి వారిని శాలువా, మెమొంటోతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు యడవల్లి అనుపమానరేందర్‌రెడ్డి, వెంపటి పార్వతమ్మాశంకరయ్య, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, వైస్ చైర్మన్‌లు పిల్లి చంద్రకళ ఆంజనేయులు, నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్లు చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్, గౌని సుధారాణి రాజారమేష్‌యాదవ్, చింతల దీప్తి, ఎల్లమ్మ, మాజీ కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, సమీనా, కమిషనర్ రామదుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. నందికొండలో కమిషనర్ శ్రీను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, వైస్ చైర్‌పర్సన్ ఆదాసు నాగరాణి, కౌన్సిలర్‌లు మంగ్త నాయక్, నాగరాణి, రమేష్‌జీ, మంద రఘువీర్, నిమ్మల ఇందిర, తిరుమలకొండ మోహన్‌రావు, ఈర్ల రామకృష్ణ, విక్రం,మోహన్ నాయక్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు



మండలంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నామని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుక అక్రమ తరలింపు, రేషన్ బియ్యం దందా జరగకుండా ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. - (ఆంధ్రజ్యోతి, వేములపల్లి)

ఆంధ్రజ్యోతి : ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు ఎలాం టి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : మూసీ, పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డు కునేందుకు రహదారుల వెంట గస్తీ నిర్వహిస్తున్నాం. రేషన్ దందాకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తాం.

ఆంధ్రజ్యోతి : నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై రాంగ్‌రూట్‌లో వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎస్ఐ: మండలంలో శెట్టిపాలెం గ్రామ శివారులో ఒకవైపే రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్‌లు, ఇటుకబట్టీలు ఉండడంతో వాహనాలు ఎక్కువగా రాంగ్‌రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణ మవు తున్నాయి. వాటిని నియంత్రణ సిబ్బందితో రోడ్ల వెంట గస్తీ నిర్వహిస్తున్నాం రాంగ్ రూట్ ప్రయాణాల వల్ల కలిగే అనర్థాలను అవగాహన కల్పిస్తున్నాం

ఆంధ్రజ్యోతి : దొంగతనాల నివారణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: గ్రామాల్లో దొంగతనాల నివారణకు ఉదయం, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అనుమానంగా ఎవరైనా సంచరిస్తే ప్రజలు సమాచారం ఇచ్చే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

ఆర్థిక సాయం

డిండి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎట్టపు ఈదమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమెది నిరుపేద కుటుంబ కావడంతో గ్రామ యువకులు రూ.10వేల సేకరించి ఈదమ్మ భర్త పేత్రుకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బొల్లె శైలేష్, పున్న దినేష్, మునగపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి క్రికెట్ పోటీలు

చింతపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు మండల స్థాయి క్రికెట్ పోటీల్లో యువత పాల్గొనాలని ఎస్ఐ యాదయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహు మతిగా రూ. 2,500, మూడో బహుమతిగా రూ. 1500 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిడమనూరులో ఆక్రమణల కూల్చివేత

● కోర్టు ఆవరణలో ఉన్న నివాస గృహాలు నేలమట్టం ● పునరావాసం కల్పించకపోవడంపై బాధితుల ఆగ్రహం

నిడమనూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న మున్సిప్ కోర్టు ఆవరణలో ఉన్న అక్రమ నివాసాలను అధికారులు బుధవారం పోలీసుల సాయంతో కూల్చివేశారు. నిడమనూరులో కోర్టు పక్కా భవనం నిర్మాణం కోసం 2016లో 230 సర్వే నంబరులో 32 గుంటల ఎన్నెస్పీ భూమిని అధికారులు కేటాయించారు. నిధులు కూడా మంజూరు కావడంతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే కోర్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా కోర్టు ఆవరణలో ఉన్న ఉప్పునూరి సాంబయ్య, గన్నెపల్లి కోటమ్మ, నాగిళ్ల ఎల్లమ్మ అక్రమంగా నివాస గృహాలను ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. కానీ వారు 40 ఏళ్లుగా జీవిస్తున్నామని, పైగా 58, 59 జీవో కింద నివాసాలను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వానికి చలాన్లు కూడా చెల్లించామని, తమకు పునరావాసం కల్పించి న్యాయం చేస్తేనే ఖాళీ చేస్తామని ఆక్రమణదారులు భీష్మించుకు కూర్చున్నారు. కోర్టు ప్రారంభానికి గడువు దగ్గర పడుతుండడంతో ఉన్నతాధికారులు రెవెన్యూ అధికారుల మీద ఒత్తిడి చేస్తుండటంతో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, నిడమనూరు, త్రిపురారం ఎస్ఐలు గోపాల్‌రావు, వీరశేఖర్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది బుధవారం ఉదయం అక్రమ నివాస గృహాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేయించారు. తమకు పునరావాసం కల్పించకుండా ఎలా కూల్చివేస్తారని నిర్వాసితులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇళ్లలో ఉన్న సామగ్రిని కూడా తీసుకునేందుకు సమయం ఇవ్వకుండా తమ ఇళ్లను అధికారులు కూల్చివేశారని బాధితులు ఆరోపించారు.



ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేత

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

నిడమనూరులో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న దళితులకు చెందిన ఇళ్లను రెవెన్యూ అధికారులు పోలీసులతో వచ్చి అక్రమంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బాధితులకు ఎలాంటి సమయం ఇవ్వకుండా అధికారులు తెల్లవారుజామున ఆరు గంటలకు వచ్చి ఇళ్లను, సామగ్రిని ధ్వంసం చేశారని ఆరోపించారు. నిర్వాసితులకు ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకుడు బొజ్జా చిన్నా, ముదిగొండ వెంకటేశ్వర్లు, బొజ్జ పుల్లయ్య, చిన్నశేఖర్, కిరణ్, శివ, లింగయ్య, భాను, రాములు, అశోక్ పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతు'లను జయప్రదం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి,జనవరి29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతుకల సభను విజయవంతం ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మండల నాయకులతో సన్నాహక సమావేశంలో మాట్లాడారు.. సభకు పెద్ద సంఖ్యలో ఉమ్మడి మండలం నుంచి మాదిగలు, ఉపకులాలు, డప్పుకళాకారులు తరలిరావాలని కోరారు. డివిజన్‌లోనే ఉమ్మడి పీఏపల్లి మండలం నుంచి అధికసంఖ్యలో తర లించి లక్ష డప్పులు వెయ్యి గొంతుకల భారీ బహిరంగ సభను చరిత్రలో నిలిచి పోయే విదంగా విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ సమావేశానికి వివిధ ప్రాంతాలు, ఉమ్మడి మండలం నుంచి వచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ యువ నాయకుడు కున్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. దీంతో దళిత సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సీఎం ఆమోదం తెలపాలి

నేరేడుగొమ్ము,(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపి అసెంబ్లీలో తీర్మాణం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నేరేడుగొమ్ము, తిమ్మాపురం, కొత్తపల్లి, పర్వాల, పెద్దమునిగల్ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఫిబ్రవరి 7న ఎస్సీ ఎబీసీడీ వర్గీకరణ అమలుకై హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డబ్బులు, వేల గొంతుకలు భారీ బహిరంగ సభ నిర్వాహించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, పండ్ల గోపి, వెంకటయ్య, నిరంజన్, రాములు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుగొమ్ములో మాట్లాడుతున్న వెంకటయ్య, శ్రీను

పెద్దగట్టు జాతరకు నిధులు విడుదల చేయాలి

హాలియా, జనవరి 29(ఆంధ్రజ్యోతి):పెద్దగట్టు(గొల్లగట్టు) జాతరకు కావాల్సిన నిధులను విడుదల చేయాలని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ బుధవారం వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా శాశ్వత పనులు జరిగి, భక్తులకు ఇబ్బందులు జరగకుండా రూ. 20 కోట్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులుఅధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా ఇబ్బంది జరగకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. దీనికి ఎంపీ రఘువీర్ సానుకూలంగా సపందించి మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జాతరకు సరిపోయే నిధులను సమకూర్చే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తొడుందిల రాజశేఖర్, జంపాల అరవింద్, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

దామరచర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తమకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే వేతనాలు అందించాలని కోరుతూ ఉపాధిహామీ సిబ్బంది బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల అమలు కోసం సెలవులు లేకుండా కష్టపడ్డామని అయినా ప్రభుత్వం వేతనాలు అందించకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి వచ్చిందన్నారు. వినతిపత్రం అంది ంచిన వారిలో పద్మ, వెంకటలక్ష్మీ, కృష్ణవేణి, నాగమణి, రమా, సావిత్రి పాల్గొన్నారు.

రంగశాయిరెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



రంగశాయిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నిడమనూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మడం గ్రామంలోని రంగశాయిరెడ్డి చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్యేలు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మార్కెట్ చైర్మన్లు అంకతి సత్యం, చంద్రశేఖర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, ఉన్నారు.

పన్ను బకాయిదారులకు నోటీసులు

మిర్యాలగూడ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పన్ను బకాయిదారులకు నోటీసులు అందజేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. పట్టణ పరిధిలో ఏళ్ల తరబడి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వారిని గుర్తించి నోటీ సులు అందజేస్తున్నామన్నారు. తొలివిడతలో పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాల యాజమాన్యంతో పాటు ఐదు దుకాణ సముదాయాల యజమానులను నోటీసులిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, అధికారులు జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

150 మందికి పరీక్షలు

చింతపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ టెలీ మెడిసన్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వర నగర్(మాల్)లో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్ రెడ్డి, ఆనంద్ బాబు, రవిచంద్ర పాల్గొన్నారు.

బంగారికుంటతండాలో పశువైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి మేఘ్యానాయక్

అడవిదేవులపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పశుసంగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వ ర్యంలో మండలంలోని బంగారికుంటతండాలో బుధవారం గోపాలమిత్ర ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ మేఘ్యానాయక్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 48 గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించామన్నారు. 32 దూడులకు నట్టల నివారణ మందులను తాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ మొలల శివారెడ్డి, గోపాలమిత్రలు, కె.దేవిసింగ్, రైతులు పాల్గొన్నారు.